ప్రజాశక్తి

బుధవారం 15 మే 2024 8 పేజీలు




ప్రకాశం బాపట్ల



స్ట్రాంగ్ రూమ్స్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

స్ట్రాంగ్ రూమ్స్‌కు ఈవీఎంలు

- పరిశీలించిన కలెక్టర్, సాధారణ పరిశీలకులు
- స్ట్రాంగ్ రూమ్స్ వద్ద పటిష్ట బందోబస్తు
- పోలింగ్ సిబ్బందికి కలెక్టర్ కృతజ్ఞతలు

8లో

రేపల్లెలో వ్యక్తి దారుణహత్య

3లో

ఎవరి ధీమా వారిదే..

- ఆరు స్థానాలపై తెలుగుదేశం ఆశలు
- వైసిపికి కూడా ఇదే స్థాయిలో నమ్మకం
- ఎంపీ స్థానంపై టిడిపిలోనే గట్టి ధీమా

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

పోలింగ్ ముగిసింది. ఉత్కంఠ పెరుగుతోంది. అభ్యర్థుల భవితవ్యం ఈవీఎంలలో ఉంది. గెలుపుపై ఇరు పార్టీల్లో ధీమాలు కనిపిస్తున్నాయి. ఈ సారి భారీ మెజార్టీలు కనిపించడం లేదు. ఎవరు గెలిచినా పది వేల లోపే అనే చర్చలు రాజకీయవర్గాల్లో వినిపిస్తున్నాయి. గత ఎన్నికల్లో వచ్చిన మెజార్టీలపై ఇప్పుడు ఎవరికీ ఆశల్లేవు. అన్నిచోట్లా గట్టిపోటీలు కొనసాగాయి. ఎక్కువ స్థానాలు గెలుస్తామని రెండు పార్టీల నేతలు చెబుతు న్నారు. పోలింగు సరళిపై విశ్లేషణలు చేసుకుంటున్నారు. ఇప్పుడు తెరపైకి అంచనాలు వచ్చాయి. ఎవరు గెలుస్తారు? ఎవరు ఓడిపోతారనే దానిపైనే వాడివేడిగా విశ్లేషణలు మొదలయ్యాయి.

పోలింగ్‌బూత్‌ల వారీగా తమకు పడ్డ ఓట్లపై అభ్యర్థులు దృష్టి సారించారు. సామాజిక తరగతుల వారీగానూ క్షేత్రస్థాయిలో పార్టీ నాయకులు ఇచ్చిన సమాచారం ఆధారంగా ఎన్ని ఓట్లు పడ్డాయనే దానిపై బూత్‌ల వారీగా లెక్కలు వేసుకుంటున్నారు. వీటి ఆధారంగానే గెలుపు, ఓటములపై ఓ అవగాహనకు వస్తున్నారు. భారీ పోలింగును ఎవరికివారే తమకు అనుకూలంగా భావిస్తున్నారు. మధ్యతరగతి వర్గాలు, వ్యాపారవర్గాలు, ఉద్యోగులు, ఐటీ ఉద్యోగులు, నిరుద్యోగులు ఎక్కువశాతం తెలుగుదేశం వైపు మొగ్గు చూపారనే చర్చ సాగుతోంది. బయట నుంచి వచ్చిన ఓటర్లపై ఇరుపార్టీల అభ్యర్థులూ ఆశలు పెట్టుకున్నారు. వైసిపికి పేదవర్గాల నుంచి, మహిళల నుంచి ఓటింగు ఎక్కువగా పడిందనే అంచనాల్లో ఉన్నారు. పార్టీ పునాది ఓటింగు రీత్యా తూర్పు నియోజకవర్గాల్లో తెలుగుదేశం పార్టీకి అనుకూలంగా ఓటింగ్ జరిగినట్లు భావిస్తున్నారు. పశ్చిమప్రాంతం వైసిపికి అనుకూలంగా పడ్డట్లు చెబుతున్నారు. తెలుగుదేశం నేతలు ఆరుస్థానాలపై గట్టి ధీమాతో ఉండగా వైసిపి నేతలు కూడా ఇదేస్థాయిలో గెలుస్తామని చెబుతున్నారు. చెరో రెండు స్థానాలు ఓడిపోతాయనే అంచనాల్లో మాత్రం స్పష్టంగా ఉన్నారు. మంత్రులు పోటీ చేసిన కొండపి, సంతనూతలపాడు నియోజకవర్గా ల్లోనూ పోలింగు ప్రతిష్టాత్మకంగానే జరిగింది. ఇక్కడ తెలుగుదేశం గట్టి ఆశల్లో ఉంది. కనిగిరి, గిద్దలూరు స్థానాలపైనా తెలుగుదేశం స్పష్టంగా ఉంది. ఒంగోలులో గట్టిపోటీ ఉందనే అంచనాల్లో ఉన్నారు. ఇక్కడ ఇరువురూ ధీమాలో ఉన్నారు. వైపాలెం, మార్కాపురం, దర్శి, ఒంగోలులో గెలుపుపై వైసిపి అభ్యర్థులు గట్టి దీమాలో ఉన్నారు. ఇలా ఎవరికి వారే ఆరుస్థానాల్లో గెలుస్తామని ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఎంపీ స్థానంలో పోటీ చూస్తే తెలుగుదేశం నుంచి పోటీలో ఉన్న సిట్టింగు ఎంపీ మాగుంట గెలుస్తారనే చర్చ తెరపైకి వచ్చింది. కొండపి, ఒంగోలుతో పాటు పశ్చిమాన కొన్నిచోట్ల క్రాస్‌ఓటింగు పడిందనే చర్చ వినిపిస్తోంది. ఇక పోలింగు రోజున వైసిపి అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డి సొంతజిల్లాలోనే ఎక్కువ సమయం ఉన్నారు. అక్కడ ఓటేసి సాయంత్రానికి జిల్లాకు చేరుకున్నారు. అసెంబ్లీ అభ్యర్థులు కేంద్రాలు తిరిగి ఆఖరు నిమిషంలోనూ ఓట్లు రాబట్టుకునే యత్నం చేశారు. గెలుపు కోసం ఓటర్లను పలు రకాలుగా ప్రలోభాలకు గురిచేశారు. డబ్బులతో పాటు ఎన్నడూ లేనివిధంగా బియ్యం బస్తాలు, నూనె ప్యాకెట్లు, చికెన్ వంటివి కూడా అందించారు. ఇవి ఎంత మేరకు ఓటర్లపై ప్రభావం చూపుతాయనేదీ చూడాలి. పేదల్లోనే ఇలాంటివి పంచారు. ఆఖరు నిమిషంలో మేనిఫెస్టోలు, పథకాలపై ఆశలు తగ్గాయి. డబ్బులపైనే అభ్యర్థులు ఆధారపడ్డారు. నోటు ఇస్తేనే ఓటు అనే భావనకు వచ్చేశారు. అందుకే రూ.1500 నుంచి రూ.3 వేల వరకూ పంచారు. పంపకాలపైనే ధీమాతో కొందరున్నారు. ఏదేమైనా పోలింగ్ సరళిని బట్టి ఎవరు గెలుస్తారు? ఎవరు కష్టమనేదీ చర్చలు సాగుతున్నాయి.

ప్రకాశంలో 87.29 శాతం పోలింగ్

- సంతనూతలపాడులో 87.55 శాతం
- దర్శిలో అత్యధికంగా 91 శాతం
- ఒంగోలులో అత్యల్పంగా 84.56..

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

సార్వత్రిక ఎన్నికలలో ప్రకాశం జిల్లాలో 87.29 శాతం పోలింగ్ నమోదైంది. ఒంగోలు పార్లమెంట్ పరిధిలోని 7 అసెంబ్లీ నియోజక వర్గాలలో 87.17 శాతం, బాపట్ల పార్లమెంట్ పరిధిలోని సంతనూతలపాడు అసెంబ్లీ నియోజకవర్గంలో 87.55 శాతం పోలింగ్ నమోదు కావటం విశేషం. జిల్లాలో ఓటర్లు చైతన్య వంతులై క్యూలైన్‌లలో బారులు తీరారు. సోమవారం రాత్రి 9 గంటల వరకు పోలింగ్ కొనసాగింది. ప్రకాశం జిల్లాలో ఒంగోలు పార్లమెంట్‌తో పాటు 7 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. జిల్లాలో 16,07,832 మంది ఓటర్లు ఉండగా 14,01,614 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరిలో పురుషులు 7,00,983 మంది, మహిళలు 7,00565 మంది, ఇతరులు 66 మంది ఓటు వేశారు. యర్రగొండపాలెం అసెంబ్లీ నియోజక వర్గంలో మొత్తం ఓటర్లు 2,07,214 మంది ఉండగా, వీరిలో 1,85,242 ఓటు హక్కు వినియోగించుకోగా 89.40 శాతం పోలింగ్ నమోదైంది. వీరిలో పురుషులు 93,044 మంది, మహిళలు 91,296 మంది

2లో

నియోజకవర్గం	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	పోలింగ్ శాతం
యర్రగొండపాలెం	2,07,214	1,85,242	89.40
దర్శి	2,26,370	2,05,993	91.00
ఎస్ఎన్‌పాడు	2,14,638	1,87,912	87.55
ఒంగోలు	2,40,242	2,03,143	84.56
కొండపి	2,39,609	2,11,350	88.21
మార్కాపురం	2,14,608	1,87,952	87.58
గిద్దలూరు	2,39,719	2,03,136	84.73
కనిగిరి	2,40,079	2,04,798	85.30
	18,22,479	15,89,526	87.29

పార్టీ మారినందుకు నీళ్లు కట్..

వాదంపల్లిలో రాళ్ల దాడి

- రెండు గ్రూపుల మధ్య ఘర్షణ
- ఐదుగురికి గాయాలు
- గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ట్యాంకర్ల వద్ద నీటిని పట్టుకొనే విషయంలో ఏర్పడిన వివాదం రాళ్లదాడికి దారి తీసిన ఘటన యర్రగొండపాలెం మండలంలోని వాదంపల్లిలో మంగళవారం జరిగింది. సార్వత్రిక ఎన్నికలు ముగిసిన మరుసటి రోజే ఘర్షణ చోటుచేసుకోవడం గమనార్హం. వైసీపీ నాయకులు ఎప్పటినుంచో ట్యాంకర్ల ద్వారా గ్రామానికి నీటిని సరఫరా చేస్తున్నారు. గత వారం రోజులు వరకు అందరూ ఆ ట్యాంకర్ వద్దనే నీళ్లు పట్టుకుంటున్నారు. అయితే ఇటీవల ఆ గ్రామానికి చెందిన ఎనిమిది ముదిరాజు కుటుంబాలు వైసీపీని వీడి టిడిపిలో చేరాయి. అప్పటి నుంచే వైసీపీ నాయకులు వారిపై గుర్రుగా ఉన్నారు. ఈ క్రమంలో ఎన్నికలు ముగిసిన మరసటి రోజే మంగళవారం గ్రామంలోకి వచ్చిన నీటి ట్యాంకర్ వద్ద నీళ్లు పట్టుకునేందుకు వైసీపీని వీడి

2లో



వాదంపల్లిలో రెండు గ్రూపులూ విసురుకున్న రాళ్లు



గ్రామానికి చేరుకున్న పోలీసు దళాలు



చేతికి తగిలిన దెబ్బను చూపిస్తున్న మహిళ

'ప్రకాశం'లో 87.29 శాతం పోలింగ్

(మొదటిపేజీ తరువాయి)

ఇతరులు ఇద్దరు ఉన్నారు. దర్శి నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,26,370 మంది ఉండగా 2,05,993 మంది ఓటు వేయగా 91 శాతం పోలింగ్ నమోదైంది. వీరిలో పురుషులు 1,03,765 మంది, మహిళలు 1,02,227 మంది, ఇతరులు ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఒంగోలులో మొత్తం ఓటర్లు 2,40,242 మంది ఉండగా 2,03,143 మంది ఓటు వేస్తే 84.56 శాతం పోలింగ్ నమోదైంది. వీరిలో పురుషులు 98,055, మహిళలు 1,05,050 మంది, ఇతరులు 38 మంది ఉన్నారు. కొండపి నియోజకవర్గంలో 2,39,609 మంది ఓటర్లు ఉండగా 2,11,350 మంది ఓటు వేయటంతో 88.21 శాతం పోలింగ్ నమోదైంది. వీరిలో పురుషులు 1,05,174, మహిళలు 1,06,174 మంది, ఇతరులు ఇద్దరు ఉన్నారు. మార్కాపురం నియోజకవర్గంలో 2,14,608 మంది ఓటర్లు ఉండగా 1,87,952 మంది ఓటు వేయగా 87.58 శాతం, పోలింగ్ నమోదైంది. వీరిలో పురుషులు 95,195 మంది, మహిళలు 92,750, ఇతరులు ఏడుగురు ఉన్నారు. గిద్దలూరు అసెంబ్లీ నియోజకవర్గంలో 2,39,710 మంది ఉండగా 2,03,136 మంది ఓటు హక్కు వినియోగించుకోవటంతో 84.74 శాతం పోలింగ్ నమోదైంది. వీరిలో పురుషులు 1,00,318, మహిళలు 1,02,809 మంది, ఇతరులు 8 మంది ఉన్నారు. కనిగిరి అసెంబ్లీ నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,40,079 మంది ఉండగా 2,04,798 మంది ఓటు వేయగా 85.30 పోలింగ్ నమోదైంది. వీరిలో పురుషులు 1,04,532 మంది, మహిళలు 1,00,259 మంది, ఇతరులు 7 ఉన్నారు.

సంతనూతలపాడులో 87.55 శాతం పోలింగ్

అదేవిధంగా బాపట్ల పార్లమెంట్ పరిధిలోని సంతనూతలపాడు అసెంబ్లీ నియోజకవర్గంలో 87.55 శాతం పోలింగ్ నమోదైంది. సంతనూతలపాడు అసెంబ్లీ నియోజకవర్గంలో 2,14,638 మంది ఓటర్లు ఉండగా 1,87,912 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరిలో పురుషులు 92,708 మంది, మహిళలు 95,202 మంది, ఇతరులు ఇద్దరు ఓటు వేశారు.

వాదంపల్లిలో రాళ్ల దాడి

(మొదటిపేజీ తరువాయి)

టిడిపిలోకి చేరిన ముదిరాజు మహిళలు వెళ్లారు. దీంతో 'మా ట్యాంకర్ల నీళ్లు మీకెందుకు?' అని వైసిపి మహిళలు అడ్డుకున్నారు. 'ఇప్పటిదాకా పట్టుకున్నాం కదా.. ఇప్పుడు ఎందుకు అడ్డు చెబుతున్నారు.?' అంటూ ప్రశ్నించారు. దీంతో 'పార్టీలు మారిన వారికి నీళ్లు ఇస్తామా..?' అంటూ వైసిపి మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో మహిళల మధ్య ఘర్షణ కాస్త పెద్దదైంది. రెండు గ్రూపులకు చెందిన పురుషులు రాళ్లతో దాడులకు దిగారు. రాళ్ల దాడిలో రెండు గ్రూపులకూ చెందిన ఐదుగురు గాయపడ్డారు. వారిలో కన్నెబోయిన వెంకటేశ్వర్లు, కన్నెబోయిన సాయికృష్ణ అనే వారికి బలమైన గాయాలయ్యాయి. గ్రామంలో యుద్ధ వాతావరణం నెలకొంది. వీధులన్నీ రాళ్లతో నిండిపోయాయి. కొందరు మహిళల చేతులకు గాయాలయ్యాయి. కలెక్టర్ ఎఎస్.దినేష్‌కుమార్ ఆదేశాలతో అడిషనల్ ఎస్పీ అశోక్‌బాబు అదనపు బలగాలతో వాదంపల్లి వెళ్లారు. ఘర్షణను అదుపులోకి తెచ్చారు. గ్రామంలోని వీధుల్లో అదనపు బలగాలతో పహారా కాసి గ్రామస్తులను ఇళ్ల నుంచి బయటకు రాకుండా కట్టడి చేశారు. గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. ఎన్నికల నేపథ్యంలో చిలికిచిలికి గాలివానలా మారి ఘర్షణ పెద్దది కావడంతో ప్రజలు ఏ క్షణనా ఏమి జరుగుతుందోనంటూ బిక్కుబిక్కుమంటున్నారు. ప్రస్తుతం గ్రామంలో పరిస్థితి అదుపులో ఉంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పొగాకు బేళ్ల అమ్మకం

ప్రజాశక్తి-కొండపి

కొండపి వేలం కేంద్రానికి ముప్పవరం, చోడవరం గ్రామాలకు చెందిన రైతులు 865 పొగాకు బేళ్లు అమ్మకానికి తెచ్చారు. అందులో 802 బేళ్ల అమ్ముడు పోయాయి. వివిధ కారణాల 63 బేళ్లను తిరస్కరించారు. కిలో పొగాకు అత్యధిక ధర రూ.300, అత్యల్ప ధర రూ.205, సరాసరి ధర రూ.254.37పైసలు పలికినట్లు వేలం నిర్వహణాధికారి జి.సునీల్‌కుమార్ తెలిపారు.

క్షతగాత్రులకు పరామర్శ

ప్రజాశక్తి-యర్రగొండపాలెం



క్షతగాత్రులను పరామర్శిస్తున్న ఎరిక్షన్‌బాబు

మండలంలోని వాదంపల్లి గ్రామంలో వైసిపి కంటే టిడిపికి అధిక ఓట్లు వస్తాయన్న భయంతో టిడిపి కార్యకర్తలపై వైసిపి నాయకులు, కార్యకర్తలు దాడికి పాల్పడినట్లు టిడిపి యర్రగొండ పాలెం నియోజక వర్గ ఎమ్మెల్యే అభ్యర్థి గూడూరి ఎరిక్షన్‌బాబు ఆరోపించారు. దాడిలో గాయపడి యర్రగొండపాలెం లోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్న బాధితులను మంగళ వారం పరామర్శించారు. దాడి జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించాలని వైద్యులను కోరారు. ఈ సందర్భంగా ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ యర్రగొండ పాలెంలో టిడిపి గెలుస్తుందనే అక్కసుతో వైసిపి నాయకులు టిడిపి కార్యకర్తలపై దాడులకు తెగబడ్డారని ఆరోపించారు. ఇలాంటి కవ్వింపు చర్యలకు భయపడేది లేదన్నారు. పోలింగ్ సమయంలో కూడా వైసిపి నేతలు పలు గ్రామాల్లో అత్యుత్సాహం ప్రదర్శించడం హేయమైన చర్య అన్నారు. వైపాలెంలో టిడిపి గెలుపును ఎవరూ ఆపలేరని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ చేకూరి సుబ్బారావు, నాయకులు చిట్టేల వెంగళరెడ్డి, మంత్రూ నాయక్, మెడబలిమి అచ్యుతరావు, మల్లయ్య, కె భాస్కర్, పాలడుగు వెంకట కోటయ్య, కంచర్ల సత్యనారాయణ గౌడ్ పాల్గొన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద నిరసన

ప్రజాశక్తి-కొండపి



నిరసన తెలుపుతున్న కాలనీ వాసులు

విద్యుత్ సమస్యను పరిష్కరించాలని కోరుతూ కొండపి అరుంధతి కాలనీ వాసులు మంగళవారం నిరసన తెలిపారు. కాలనీలో ప్రతి రోజూ విద్యుత్ సమస్య తలెత్తు తుండంతో సమస్యను వివరించేందుకు కాలనీ వాసులు విద్యుత్ సబ్ స్టేషన్ కార్యాలయం వద్దకు వెళ్లారు. అక్కడ ఎఇ అందుబాటులో లేక పోవడంతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ తమ కాలనీలో నిత్యం విద్యుత్ సమస్య తలెత్తుతున్నట్లు తెలిపారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లితే తాత్కాలికంగా మరమ్మతులు చేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని ఎఇని అనేక సార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న దాఖలాలు లేవని ఆరోపించారు. సోమవారం రాత్రి 10 గంటల సమయంలో ట్రాన్స్‌ఫార్మర్‌లో పెద్దపెద్ద మంటలు రావడంతో విద్యుత్ నిలిచిపోయినట్లు తెలిపారు. అధికారులకు సమాచారం ఇచ్చినప్పటికీ అధికారులు పట్టించుకోలేదని తెలిపారు. రాత్రంతా అంధకారంలోనే గడిపినట్లు తెలిపారు. దోమల బెడదతో అల్లాడినట్లు తెలిపారు. వృద్ధులు, చిన్నపిల్లలు, మహిళలు అవస్థలకు గురైనట్లు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించిన విద్యుత్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. లేకుంటే సమస్యను విద్యుత్ డిఇ, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

ప్రజలకు గొట్టిపాటి లక్ష్మి కృతజ్ఞతలు

ప్రజాశక్తి-దర్శి

సార్వత్రిక ఎన్నికల్లో తనకు సహకరించిన తెలుగుదేశం, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలకు టిడిపి దర్శి నియోజక వర్గ ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి మంగళవారం కతజ్ఞతలు తెలిపారు. తనకు సహకరించిన వారందరికీ పేరుపేరునా ఆమె ధన్యావాదాలు తెలిపారు. ఎన్నికల సందర్భంగా బొట్లపాలెంలో గాయపడ్డ కార్యకర్తలకు తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.



టిడిపి నాయకులతో మాట్లాడుతున్న గొట్టిపాటి లక్ష్మి

బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి కృతజ్ఞతలు

సార్వత్రిక ఎన్నికల్లో సహకరించిన వైసిపి, నాయకులు, అభిమానులకు వైసిపి దర్శి నియోజక వర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ కతజ్ఞతలు రెడ్డి తెలిపారు. స్థానిక కార్యాలయంలో వైసిపి నాయకులు, కార్యకర్తలతో శివప్రసాద్‌రెడ్డి మంగళవారం మాట్లాడారు. ఎన్నికల సమయంలో తనకు సహకరించిన నియోజకవర్గ ప్రజలు, వైసిపి నాయకులు, కార్యకర్తలు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఓటెత్తిన మహిళలు

ప్రజాశక్తి-కొండపి

సార్వత్రిక ఎన్నికలలో కొండపి నియోజక వర్గంలో మహిళలు అధిక శాతం మంది తమ ఓటు హక్కును వినియోగించు కున్నారు. నియోజక వర్గంలో మొత్తం 2,39,609 ఓటర్లు ఉన్నారు. అందులో పురుషులు 1,18,624 మంది, స్త్రీలు 1,20,982, ఇతరులు ముగ్గురు ఉన్నారు. పురుషులు 1,04,949, స్త్రీలు 1,06,065 , ఇతరులు ఇద్దరు కలిపి మొత్తం 2,11,016 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. నియోజకవర్గంలో 88.07 శాతం పోలింగ్ నమోదైంది.

మండలాల వారీగా ఓటింగ్ ఇలా...

మర్రిపూడి మండలంలో పురుషులు 17,589, స్త్రీలు 16,709 కలిపి మొత్తం 34,298 ఓటర్లు ఉండగా, అందులో పురుషులు 16,233, స్త్రీలు 15,301 మంది కలిపి మొత్తం 31,534 మంది ఓటు హక్కును వినియోగిం చుకున్నారు. 91.94 శాతం ఓటింగ్ నమోదైంది. పొన్నలూరు మండలంలో పురుషులు 16,962, స్త్రీలు 16,951 మంది కలిపి మొత్తం 33,913 మంది ఓటర్లు ఉండగా, అందులో పురుషులు 15,202, స్త్రీలు 15,169 మంది కలిపి మొత్తం 30,371 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 89.56 శాతం ఓటింగ్ నమోదైంది. జరుగుమల్లి మండలంలో పురుషులు 16,882, స్త్రీలు 17272 , ఇతరులు ఇద్దరు కలిపి మొత్తం కలిపి 34,156 ఓటర్లు ఉండగా, అందులో పురుషులు 15,336, స్త్రీలు 15,480, ఇతరులు ఒకరు కలిపి మొత్తం 30,187 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 90.22 శాతం నమోదు ఓటింగ్ నమోదైంది.కొండపి మండలంలో పురుషులు 16,985, స్త్రీలు 17,318 , ఇతరులు ఒకరు కలిపి మొత్తం 34,304 మంది ఓటర్లు ఉండగా అందులో పురుషులు 15,466, స్త్రీలు 15,878 , ఇతరులు ఒకరు కలిపి మొత్తం కలిపి 31,345 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 91.37 శాతం ఓటింగ్ నమోదైంది. టంగుటూరులో పురుషులు 24,139, స్త్రీలు 25592 మొత్తం 49731 ఉండగా అందులో ఓటు హక్కును పురుషులు 21,128, స్త్రీలు 22,342 మొత్తం 43,470 వినియోగించుకొని 87.41 శాతం సింగరాయకొండలో పురుషులు 26,067, స్త్రీలు 27,140 మొత్తం 53,207 ఓటర్లు ఉండగా, అందులో పురుషులు 21,584, స్త్రీలు 21,895 మొత్తం 43,479 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 81.72 శాతం ఓటింగ్ నమోదైంది.

ప్రజల ఆదరణ మరువలేనిది : దేవరపల్లి

ప్రజాశక్తి -కనిగిరి

కనిగిరి ప్రాంత ప్రజలు తనపై చూపిన ఆదరణ మరువలేనిదని కాంగ్రెస్ పార్టీ కనిగిరి నియోజక వర్గ అభ్యర్థి దేవరపల్లి సుబ్బారెడ్డి తెలిపారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ కనిగిరి ఎమ్మెల్యే అభ్యర్థిగా సార్వత్రిక ఎన్నికల్లో తాను పోటీ చేసినట్లు తెలిపారు. తనకు ఓటు వేసిన ప్రతి ఒక్కరికీ పాదాభివందనాలు చేస్తున్నట్లు తెలిపారు. ఇండియా కూటమి బలపరిచిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా కనిగిరి ప్రాంత ప్రజలను ఓట్లు అడిగేందుకు వెళ్లగా సొంత మనిషిగా ఎంతో ఆప్యాయంగా ప్రజలు ఆదరించారన్నారు. వామపక్ష పార్టీలు సిపిఎం, సిపిఐ పార్టీ శ్రేణులు, నాయకులు



మాట్లాడుతున్న దేవరపల్లి సుబ్బారెడ్డి

వెన్నుదన్నుగా నిలిచి ప్రచార మరియు పోలింగ్ ప్రక్రియ విజయవంతంగా సాగేలా సహకారం అందించారన్నారు. ఈ సమావేశంలో సిపిఎం కనిగిరి పట్టణ కార్యదర్శి పిసి.కేశవరావు, నాయకులు నరేంద్ర, సిపిఐ నాయకులు జిపి.రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఐదేళ్ల కష్టానికి గుర్తింపు : ఉగ్ర

ప్రజాశక్తి -కనిగిరి

గత 5 ఏళ్ల నుంచి అనేక ఒడిదుడుకులు ఎదుర్కొన్న కార్యకర్తల కష్టానికి తగిన గుర్తింపు ఈ ఎన్నికలు అని టిడిపి కనిగిరి నియోజక వర్గ అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి తెలిపారు. సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ముగిసిన నేపథ్యంలో నియోజకవర్గంలోని ఆరు మండలాలకు టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో అమరావతి గ్రౌండ్ కి చేరుకొని డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డికి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ భారీ సంఖ్యలో టిడిపి శ్రేణులు అమరావతి గ్రౌండ్‌కు చేరుకోవడం విజయోత్సవ సభను తలపిస్తుందని సంతోషాన్ని వ్యక్తం చేశారు.కష్టపడిన ప్రతి ఒక్కరికీ పాదాభివందనలు తెలిపారు. . ఎండను, వర్షాన్ని లెక్కచేయకుండా రాత్రి వేళలో కూడా ఓటు వేసేందుకు బారులు తీరి ఓటు వేసిన ప్రజలకు మరియు సుదూర ప్రాంతాల్లో ఎక్కడ ఉన్నా తరలివచ్చి ఓటు వేసిన వారికి తాను రుణపడి ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యక్తి దారుణ హత్య

తల నరికి తీసుకెళ్లిన వైనం

ప్రజాశక్తి - రేపల్లె

పాత కక్షల నేపధ్యంలో ఓ వ్యక్తిని దారుణంగా హత్య చేసి తల నరికి తీసుకెళ్లిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. పట్టణ పరిధిలోని 18 వ వార్డు సమీపంలోని జగనన్న కాలనీ వద్ద ఘటన చోటుచేసుకుంది పోలీసుల కథనం ప్రకారం... రేపల్లె మండలం గుడ్డికాయలంక గ్రామానికి చెందిన యరగళ్ల సుబ్బారావు (42)) అనే వ్యక్తిని రేపల్లె పట్టణంలోని 18వ వార్డు జగనన్న కాలనీలో పక్కన ఉన్న ప్రైవేటు వెంచర్ల వద్ద గుర్తుతెలియని వ్యక్తులు దారుణంగా హత్య చేసి మతుడి తల నరికి తీసుకెళ్లినట్లు పట్టణ సిఐ నజీర్ బేగ్ తెలిపారు. మతుడితో మరికొందరు మద్యం సేవించినట్లు ఆయన తెలిపారు. మతుడి పొత్తికడుపుపై బలమైన గాయాలు ఉన్నట్లుగా పోలీసులు గుర్తించారు. తలతోపాటు మతుడి మర్మంగాలు కూడా కోసి తీసుకువెళ్లారు. ఘటనా స్థలాన్ని రేపల్లె డిఎస్‌పి మురళీకష్ణ సందర్శించారు. హత్యకు గల కారణాలను సేకరిస్తున్నారు. మతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ నజీర్ బేగ్ తెలిపారు.


సుబ్బారావు (ఫైల్)

లారీని ఢీకొన్న కారు..

ఇద్దరికి స్వల్ప గాయాలు

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

లారీని వెనుక నుంచి కారు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన మార్టూరు సమీపంలోని కోనంకి వద్ద జాతీయ రహదారిపై మంగళవారం చోటు చేసుకుంది. హైవే మొబైల్ పోలీసుల కథనం ప్రకారం... శ్రీ సత్యసాయి జిల్లా కదిరి పట్టణానికి చెందిన గాలివేటి శశిధర్ నాయుడు తన మిత్రుడితో కలిసి వ్యక్తిగత పనుల నిమిత్తం అనకాపల్లి వెళ్లారు. అక్కడ పనులు ముగించుకొని తిరిగి తమ స్వగ్రామానికి వస్తున్నారు. కోనంకి వద్దకు వచ్చే సరికి కోయంబత్తూరు వెళుతున్న టీ లోడు లారీ డ్రైవర్ ఒకసారిగా షడన్ బ్రేక్ వేశాడు. దీంతో కారు లారీని వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది. కారులో ఎయిర్ బ్యాగులు తెరుచుకోవడంతో డ్రైవర్ తో సహా మరో వ్యక్తి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న హైవే మొబైల్ సిబ్బంది నాయక్ కారులోని వ్యక్తులను స్థానికుల సహాయంతో బయటకు తీశారు. సమాచారం అందుకున్న మార్టూరు సిఐ రాజశేఖరరెడ్డి జాతీయ రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకున్నారు.


ప్రమాదంలో దెబ్బతిన్న కారు

వడదెబ్బతో మహిళ మృతి

ప్రజాశక్తి-కొండపి

వడదెబ్బతో మహిళా మృతి చెందింది. ఈ ఘటన మండల పరిధిలోని పెట్లూరు బీసీ కాలనీలో చోటు చేసుకుంది. అందిన వివరాల ప్రకారం.. పెట్లూరు బీసీకాలని చెందిన దేపూరి సుశీల (62) రోజు కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంది. సార్వత్రిక ఎన్నికల మిత్తం సోమవారం ఓటు వేయటానికి పోలింగ్ కేంద్రం వద్దకు వెళ్లింది.ఆయాసంగా ఉండడంతో ఎక్కువ సేపు నిలబడలేక ఓటు వేయకుండా ఇంటికి వచ్చింది. వెంటనే కొండపి ఆసుపత్రికి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకొంది. అనంతరం ఓటు వేయటానికి మళ్లీ పోలింగ్ కేంద్రానికి వచ్చింది. ఆయాసం ఎక్కువగా కావడంతో ఇంటికి వచ్చి మంచంపై పడకొని అలాగే చనిపోయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వేడి, ఉక్కపోత తీవ్రత కారణంగా వడదెబ్బ తగిలి సుశీల మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.


సుశీల (ఫైల్)

యువకుడిపై దాడి

ప్రజాశక్తి-పొదిలి

టిడిపికి ఓటు వేశారనే కారణంతో మండల పరిధిలోని పోతవరం గ్రామంలో ఎస్‌సిలకు చెందిన రెండు గ్రూపుల మధ్య మంగళవారం ఘర్షణ చోటు చేసుకుంది. మరియదాసు అనే యువకుడిని టిడిపికి ఎందుకు ఓటు వేశారని నిలదీస్తూ వైసిపి వారు దాడి చేశారు. దీంతో మరియదాసుకు స్వల్ప గాయాల య్యాయి. ఘర్షణ గురించి సమాచారం అందుకున్న ఎస్‌ఐ తన సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకొని ఇరు గ్రూపుల వారి చెదరగొట్టారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి-పొదిలి

బైకులు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతిచెందాడు. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన మర్రిపూడి మండల పరిధిలోని ఉప్పలపాడు- శివరాయుని పేట రహదారిలో గ్రానైట్ పాలిషింగ్ ఫ్యాక్టరీల వద్ద మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. ఈ ఘటనలో మర్రిపూడి మండలం శివరాయుని పేట గ్రామానికి చెందిన మాణికల చిన్న మీరా(56) అక్కడికక్కడే మృతిచెందాడు. అదే గ్రామానికి చీమల వెంకటేశ్వర్లు, మరిపూడి మండలానికి చెందిన చిమట గ్రామస్తుడు దినపల్లి వెంకటేశ్వర్లుకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో ఒంగోలు తరలించారు.

సిఎస్‌పురంలో ఉద్రిక్తత

పోలీసుల చొరవతో సర్దుమణిగిన వివాదం

ప్రజాశక్తి- సిఎస్ పురంరూరల్

మండల కేంద్రమైన సిఎస్‌పురంలో మంగళవారం ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా సిఎపురంలోని పోలింగ్ కేంద్రం వద్ద వైసిపి నాయకుడు మేకల చిన్న తిరుపతి పై టిడిపి కార్యకర్తలు సోమవారం దాడి చేసిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో సిఎస్‌పురానికి చెందిన ఓ యువకుడు మంగళవారం ట్రాక్టర్‌పై వెళ్తుండగా స్థానిక గంగమ్మ తల్లి ఆలయం వద్ద ఆ యువకుడిపై వైసిపి కార్యకర్తలు దాడి చేశారు. బాధిత యువకుడు బలిజ కులానికి చెందిన వ్యక్తి కావడంతో గొడవ కాస్త యాదవ, బలిజ సామాజిక వర్గాల మధ్య గొడవగా మారింది. దీంతో బలిజ కులస్తులు బస్టాండ్ సెంటర్ లో మోహరించారు. యాదవులు డీజీ పేట రోడ్డులో ఉన్న గంగమ్మ తల్లి ఆలయం వద్ద మోహరించారు. దీంతో ఏ సమయంలో ఏం జరుగుతుందోనని ప్రజలు భయాందోళనకు గురయ్యారు. వాతావరణం ఉద్రిక్తంగా ఉండడంతో పామూరు సిఐ రామనాయక్, సిఎస్‌పురం, పామూరు, వెలిగండ్ల ఎస్‌ఐలు ప్రేమ్ కుమార్, సైదుబాబు, శివ సిఎస్‌పురం చేసుకున్నారు. ఇరు గ్రూపులకు చెందిన పెద్దలతో, వైసిపి, టిడిపి నాయకులతో చర్చలు జరిపి ఉద్రిక్తంగా ఉన్న వాతావరణాన్ని చల్ల పరిచారు. దీంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.


బస్టాండ్ సెంటర్లో మోహరించిన ఓ గ్రూపు వారు


గంగమ్మ తల్లి ఆలయం వద్ద ఉన్న వారితో మాట్లాడుతున్న ఎస్ఐ

పిచ్చి కుక్కల స్వైర విహారం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం పట్టణంలో పిచ్చి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. వీధుల్లో నడుచకుంటే వెళ్తున్న ప్రజలపై దాడి చేసి గాయపరుస్తున్నాయి. కొలుకుల రోడ్డులో జానీ అనే వ్యక్తి మంగళవారం నడుచుకుంటు వెళుతుండగా పిచ్చికుక్క అతనిపై దాడి చేసింది. దీంతో అదేవిధంగా బీసీ కాలనీకి చెందిన వెంకటేశ్వర్లు అనే వ్యక్తిని పిచ్చికుక్క గాయపరిచింది. దీంతో ప్రజలు వీధుల్లోకి రావాలంటేనే జంకుతున్నారు. పంచాయితీ అధికారులు స్పందించి పట్టణంలో పిచ్చి కుక్కల బెడదను నివారించాలని ప్రజలు కోరుతున్నారు. ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ కృష్ణారెడ్డిని వివరణ కోరగా పిచ్చి కుక్క కాటుకు గురైన వారు వెంటనే ప్రభుత్వ వైద్యశాలకు వచ్చి యాంటిరాబిస్ వ్యాక్సీన్‌లు వేయించు కోవాలన్నారు. వైద్యశాలలో వ్యాక్సీన్ అందుబాటులో ఉన్నట్లు చెప్పారు.


కుక్కల దాడిలో గాయపడిన వ్యక్తి

చంద్రశేఖర్‌ను కలిసిన ఎంపిపి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

వైసిపి యర్రగొండపాలెం ఎమ్మెల్యే అభ్యర్థి తాటిపర్తి చంద్రశేఖర్ విజయం తథ్యమని, అలాగే మరోసారి ముఖ్యమంత్రిగా జగనన్న అధికారం చేపట్టబోతున్నారని యర్రగొండపాలెం ఎంపిపి దొంతా కిరణ్ గౌడ్ తెలిపారు. స్థానసిక వైసిపి కార్యాలయంలో తాటిపర్తి చంద్రశేఖర్‌ను మంగళవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎన్నికల్లో కష్టపడ్డ కార్యకర్తలకు, నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం చంద్రశేఖర్‌తో సమావేశమై ఓటింగ్ సరళి గురించి వివరించారు. ఏపి పంచాయతీల్లో మెజార్టీ ఓట్లు వస్తుందనే విషయం గురించి తెలిపారు. జగనన్నను మరోమారు ముఖ్యమంత్రిని చేయాలనే లక్ష్యంతో మహిళలు, వృద్ధులు, వికలాంగులు సైతం అత్యధికంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని చెప్పారు. ఈ క్రమంలోనే యర్రగొండ పాలెం నియోజకవర్గంలో 89.40 శాతం పోలింగ్ నమోదైనట్లు తెలిపారు.ఎన్నికలలో పని చేసి చంద్రశేఖర్ గెలుపుకు కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు.


చంద్రశేఖర్‌తో ఎంపిపి కిరణ్ గౌడ్


బాధితుడిని పరామర్శిస్తున్న బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి

బాధితుడికి బూచేపల్లి పరామర్శ

ప్రజాశక్తి-దర్శి

సార్వత్రిక ఎన్నికల సందర్భంగా దర్శి మండలం దేవవరం గ్రామంలో టిడిపి కార్యకర్తల దాడిలో గాయపడిన వైసిపి కార్యకర్తలను వైసిపి దర్శి నియోజక వర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి మంగళవారం పరామర్శించారు. అండగా ఉంటానని, అధైర్య పడొద్దని వారికి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వంపై కసితోనే భారీగా పోలింగ్

- వైసిపికి ఇవే చివరి ఎన్నికలు
- ఓటమి భయంతోనే దాడులు
- రాష్ట్రంలో కూటమిదే అధికారం
- ఎంఎల్‌ఎ అభ్యర్థి ఏలూరి సాంబశివరావు

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

ఒక్క అవకాశం ఇవ్వండంటూ అధికారంలోకి వచ్చిన వైఎస్ జగన్‌రెడ్డి పాలనలో దౌర్జన్యాలు, దోపిడీ, అరాచకం, అన్యాయం, అక్రమాలతో విసిగి వేసారిన ప్రజలు వైసిపి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలనే కసితో పోలింగులో పెద్ద ఎత్తున ఓటు వేశారని టిడిపి, జనసేన, బిజెపి కూటమి ఎంఎల్‌ఎ అభ్యర్థి ఏలూరి సాంబశివరావు అన్నారు. తన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని వివిధ మండలాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో పోలింగ్ జరిగిన తీరుపై మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వ నిరంకుశ పాలనతో విసిగి, వేసారిపోయిన ప్రజలు తమ కూటమికి పట్టం కట్టడానికి ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి సుదూరప్రాంతాల నుండి తమ గ్రామాలకు వచ్చి ఓటు హక్కు వినియోగించుకోవడం ప్రభుత్వంపై ప్రజలకున్న వ్యతిరేకత తెలుస్తుందని అన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం, భావితరాల భవిష్యత్తు కోసం


టిడిపి కార్యకర్తలతో ఏలూరి సాంబశివరావు

ప్రజలు పెద్ద ఎత్తున తరలి రావడం అభినందనీయమని అన్నారు. ఓటమి భయంతోనే వైసిపి ప్రభుత్వం అధికారాన్ని అడ్డం పెట్టుకొని కుట్రలకు పాల్పడి దాడులకు తెగబడిందని ఆరోపించారు. ప్రజలు ఇచ్చిన తీర్పుతో అత్యధిక మెజారిటీతో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా నూతన ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు. అపార అనుభవం, విజనరీ కలిగిన టిడిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుతో రాష్ట్ర పునర్నిర్మాణం తిరిగి సాధ్యమవుతుందని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తామని అన్నారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రజాపాలన సాగిస్తామని తెలిపారు. రానున్నఎన్నికల ఫలితాల్లో రాష్ట్ర వ్యాప్తంగా కూటమి ప్రభంజనం కొనసాగుతుందని అన్నారు. అధికారాన్ని అడ్డం పెట్టుకొని ఎన్ని కుట్రలు చేసినా ప్రజలు అంతిమ తీర్పు కూటమికే ఇచ్చారని అన్నారు. టిడిపి కూటమి విజయం కోసం కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరిని అభినందించారు. రానున్న టిడిపి ప్రభుత్వంలో ప్రజలకు ఏ సమస్య వచ్చినా పరిష్కరించేందుకు కృషి చేస్తానని అన్నారు. నియోజకవర్గాన్ని రాష్ట్రంలో అభివృద్ధిలో అగ్రగామిగా నిలుపుతానని అన్నారు.


టిడిపి కార్యకర్తలతో మాట్లాడుతున్న ఏలూరి సాంబశివరావు

16న కౌలు వేలం

ప్రజాశక్తి - పంగులూరు

పంగులూరు గ్రూపు దేవాలయాలకు సంబంధించిన భూముల కౌలు వేలం పాటలు, ఈ నెల 16న గురువారం పంగులూరులో జరుగుతాయని ఇఒ యు శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. స్థానిక భీమ లింగేశ్వర స్వామి దేవాలయానికి చెందిన సర్వేనెంబర్లు 120, 121, 151, 410 లలోని 47 ఎకరాల 28 సెంట్లు మెట్ట భూమి, పంగులూరులోని వీరేశ్వర స్వామి దేవాలయానికి చెందిన సర్వేనెంబర్ 4, 263లోని 25ఎకరాల మెట్ట భూమి, పంగులూరులోని వేణుగోపాల స్వామి దేవాలయానికి చెందిన సర్వేనెంబర్ 316, 322లలోని 14ఎకరాల 34సెంట్ల మెట్ట భూమికి బహిరంగ కౌలు వేలం జరుపుతామని తెలిపారు. 2023 - 2024 నుండి 2026 - 2027 వ సంవత్సరం వరకు కౌలు కాల పరిమితి ఉంటుందని తెలిపారు. ఈ కౌలు వేలంలో పాల్గొనదలచిన వారు పాటకు ముందు రూ.5వేల ధరావతు చెల్లించి వేలంలో పాల్గొనవచ్చని తెలిపారు. పాట ముగిసిన వెంటనే హెచ్చు పాట దారుడు డిపాజిట్ కాకుండా ఒక సంవత్సరానికి మొత్తం చెల్లించాలని తెలిపారు. పాటలో పాల్గొనదలచిన వారు 16న ఉదయం 9గంటలకు పంగులూరులోని వేణుగోపాల స్వామి దేవాలయం వద్ద దేవాదాయ ధర్మదాయ శాఖ అధికారుల సమక్షంలో జరిగే బహిరంగ కౌలు వేలంపాటలో పాల్గొనాలని కోరారు.


మాట్లాడుతున్న మాజీ మంత్రి నక్కా ఆనందబాబు

కార్యకర్తలకు అభినందనలు

ప్రజాశక్తి - వేమూరు

సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన నాటి నుండి టిడిపి, జనసేన ఓటమి గెలుపుకు కృషి చేస్తూ ప్రచారం చేపట్టిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు టిడిపి అభ్యర్థి నక్కా ఆనందబాబు కృతజ్ఞతలు తెలిపారు. టిడిపికి పట్టుకొమ్మలు కార్యకర్తలేనని అన్నారు. రాష్ట్రంలో దిగజారిన అభివృద్ధి, సంక్షేమాన్ని గాడిలో పెట్టి ముందుకు నడిపించేందుకు చంద్రబాబును ముఖ్యమంత్రిగా గెలిపించుకునేందుకు ప్రతి ఒక్కరు దూర ప్రాంతాల నుండి కూడా వచ్చి ఓటు హక్కు వినియోగించుకున్న ప్రతి ఒక్కరికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో జరుగుతున్న అరాచక పాలనలో అంతం చేసేందుకు దేశ, విదేశాల్లోని టిడిపి అభిమానులు సైతం ఎన్నికల్లో ఓటు హక్కు ఉపయోగించు కున్నారని అన్నారు. దీని కారణంగానే నియోజకవర్గంలో 85.02 శాతం పోలింగ్ నమోదైనట్లు తెలిపారు. టిడిపి గెలుపే లక్ష్యంగా పనిచేసిన ప్రతి ఒక్కరికి ఆయన ధన్యవాదాలు తెలిపారు.


కార్యకర్తలతో మాట్లాడుతున్న కందుల నారాయణరెడ్డి

ఎన్నికల్లో కష్టపడ్డ కార్యకర్తలకు కృతజ్ఞతలు

ప్రజాశక్తి - పొదిలి

హోరాహోరీగా జరిగిన మార్కాపురం అసెంబ్లీ ఎన్నికల్లో టిడిపి అభ్యర్థుల గెలుపు కోసం కష్టపడిన కార్యకర్తలకు టిడిపి అభ్యర్థి కందుల నారాయణరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల అనంతరం పొదిలిలో తొలి సారిగా కార్యకర్తలను మంగళవారం కలిశారు. తెలుగు దేశం ఒంగోలు పార్లమెంటు అభ్యర్థి మాగుంట శ్రీనివాసులురెడ్డి, తన కోసం కష్టపడిన ప్రతి ఒక్కరిని గుర్తుంచు కుంటామని అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో కార్యకర్తలు, అభిమానులతో కలిసి తేనీరు సేవించారు. నిన్న జరిగిన ఓటింగ్‌పై చర్చించారు. కష్టపడిన ప్రతి కార్యకర్తకు తన మనసులో స్థానం ఉంటుందని అన్నారు. నారాయణరెడ్డి రాకతో స్థానిక టిడిపి శ్రేణుల్లో సందడి నెలకొంది. కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

మాతృ మరణాలను నివారించాలి

ప్రజాశక్తి - బాపట్ల

మాతృ మరణాలు పూర్తిస్థాయిలో నివారించి తల్లి, బిడ్డ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని డిఎం అండ్ హెచ్ఒ ఎస్ విజయమ్మ వైద్యా ధికారులకు సూచించారు. తన కార్యాలయంలో వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బందితో మాతృ మరణాల నియంత్రణపై మంగళవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో బాల్య వివాహాల వల్లే అధికంగా మాతృ మరణాలు సంభవిస్తున్నాయని అన్నారు. ప్రధానంగా చిన్న వయసులో జరుగుతున్న బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి గ్రామంలో అంగన్‌వాడీ, వార్డు సచివాలయ సిబ్బంది, స్వచ్ఛంద సేవ సంస్థల సహకారంతో టీములు ఏర్పాటు చేయాలని అన్నారు. బాల్య వివాహాలతో కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. ప్రతి గర్భిణీ స్త్రీకి తప్పనిసరిగా నాలుగు సార్లు వైద్యాధికారులతో ఆరోగ్య సిబ్బంది వైద్య పరీక్షలు చేయించాలని సూచించారు. ఎనీమియాను గుర్తించినట్లయితే తప్పనిసరిగా ప్రత్యేక ఆరోగ్య పరీక్షలు నిర్వహించి నిరంతరం ఆరోగ్య స్థితిగతులను పరివేక్షించాలని అన్నారు. కాన్పు కష్టమైనప్పుడు ఆసుపత్రికి వస్తే గర్భిణీల వివరాలు నమోదు చేయాలని చెప్పారు. జనన ప్రణాళికతో నిత్యం పర్యవేక్షణలో వారికి అవసరమైన అదనపు వైద్య సౌకర్యాలు


సూచనలిస్తున్న డిఎం అండ్ హెచ్ఒ విజయమ్మ

కల్పించేందుకు సిద్ధంగా ఉండాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో గర్భిణీలకు పౌష్టికాహారంతోనే తల్లి, బిడ్డ ఆరోగ్యమనే అంశంపై గర్భిణీలకు ఆశాలు, ఆరోగ్య కార్యకర్తలు అవగాహన కల్పించాలని అన్నారు. సమావేశంలో జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డిఐఒ టి వెంకటేశ్వర్లు, ఎం సౌజన్య, రోహిణి రత్నశ్రీ, శేషు కుమార్, ప్రేమ పావని, మాతృ మరణాల కమిటీ సభ్యులు డి రామకృష్ణ హనుమాన్, ప్రసూతి వైద్య నిపుణులు సునీత, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, సూపర్ వైజర్లు పాల్గొన్నారు.


గాయపడ్డ వారిని పరామర్శిస్తున్న కైపు మహేష్ రెడ్డి

కార్యకర్తలకు పరామర్శ

ప్రజాశక్తి - సంతమాగులూరు

మండలంలోని మిన్నేకల్లు గ్రామంలో సోమవారం జరిగిన ఎన్నికల సందర్భంగా ఎస్సీ కాలనీ పోలింగ్ బూత్‌లో టిడిపి వర్గీయులు దాడి చేయగా వైసిపీ నాయకుడు కంభంపాటి కోటేశ్వరరావు తీవ్రంగా గాయపడి నరసరావుపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయనను వైసిపీ అభ్యర్థి పానెం చిన్న హనిమిరెడ్డి సోదరుడు కైపు మహేష్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు. ఓటమి భయంతోనే టిడిపి దాడి చేశారని మహేష్‌రెడ్డి అన్నారు. 20ఏళ్ల క్రితం గ్రామంలో ఉన్న ఓ కుటుంబం వేరే గ్రామం వెళ్లి అక్కడ ఓట్లు వేసి, తిరిగి మరలా మిన్నేకల్లు వచ్చి ఓట్లు వేసేందుకు ప్రయత్నిస్తుండగా అడ్డుకున్నందుకు వైసిపీ నాయకులపై టిడిపి వాళ్ళు కర్రలతో దాడి చేసి కోటేశ్వరరావును తీవ్రంగా గాయపరిచారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన వెంట ఎఎంసి మాజీ ఛైర్మన్ బొల్లినేని రామకృష్ణ, నాయకులు శ్రీకృష్ణ, పానకాలు, కంభంపాటి వెంకట్రావు, కంభంపాటి వినోద్ ఉన్నారు.

ఓటమి భయంతోనే టిడిపి దాడులు

రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణరావు

ప్రజాశక్తి - రేపల్లె

ఓటమి భయంతోనే టీడీపీ బరితెగింపు దిగుతోందని, వైసీపీకి అనుకూలంగా ఉన్న వాతావరణాన్ని దాడులతో భయానకం చేసి మార్చాలని చూశారని రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు అన్నారు. సోమవారం జరిగిన పోలింగ్ సరళిని పసిగట్టిన అనంతరం ఓటమి తప్పదని గ్రహించిన సత్యప్రసాద్ తన అక్కసు వెళ్లగక్కాడని అన్నారు. స్థానిక ప్రకాశం స్కూల్ పోలింగ్ బూత్ వద్ద ఉన్న వైసీపీ కార్యకర్తలు చిత్రాల ఒబేదు, ఆలా రాజ్పాల్‌పై దాడికి తెగబడటం సిగ్గుచేటని అన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద రౌడీ మూకలను వెంటబెట్టుకొని టిడిపి అభ్యర్థి అనగాని సత్యప్రసాద్ ఎక్కడికక్కడ వైసిపి నాయకులపై దాడులు చేయడం బాధాకరమని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీ దాడులను ప్రోత్సహిస్తుందని అన్నారు. ఏవిధంగానైనా అధికారంలోకి రావాలనే కుట్రతోనే టీడీపీ నేతలు దౌర్జన్యాలు, దుర్మార్గాలకు తెగబడుతున్నారని అన్నారు. దాడులకు భయపడేది లేదన్నారు. తాను ఏనాడూ ఇలాంటి రాజకీయ ఘర్షణలను ప్రోత్సహించలేదని అన్నారు. ఏ


సమావేశంలో మాట్లాడుతున్న మోపిదేవి వెంకటరమణరావు

వర్గంపైన కక్ష సాధించలేదని అన్నారు. చిత్రాల ఒబేదుకు, ఆళ్ల రాజ్‌పాల్‌కు అనగాని క్షమాపణ చెప్పాలని అన్నారు. తమ నాయకులు, కార్యకర్తలపై దాడులు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ప్రజా తీర్పు తమకు అనుకూలంగా ఇచ్చారని అన్నారు. సంక్షేమ పథకాల లబ్ధి పొందిన మహిళలు స్పందించి పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారని అన్నారు. రానున్నది వైసీపీ ప్రభుత్వమేనని, మళ్లీ జగన్మోహన్‌రెడ్డి సిఎంగా ప్రమాణస్వీకారం చేసి సంక్షేమం, అభివృద్ధి కొనసాగిస్తారని అన్నారు.


చలివేంద్రం ప్రారంభిస్తున్న వి ఇమ్మానియేలు

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - కొల్లూరు

మండలంలోని ఐటిఐ కళాశాల ప్రక్కన హోప్ మిషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సమస్త డైరెక్టర్ వి ఇమ్మానుయేలు మంగళవారం ప్రారంభించారు. వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకే ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో నిస్సి జ్యోతి, పాస్టర్ వి సురేష్, సంఘ సభ్యులు, పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

ఇవిఎంల వద్ద మూడు అంచెల భద్రత

కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి-శింగరాయకొండ

టంగుటూరు మండలం వల్లూరు సమీపంలోని రైస్ కృష్ణ సాయి ఇంజినీరింగ్ కళాశాలలో భద్రపరిచిన ఒంగోలు పార్లమెంట్ పరిధిలోని ఇవిఎంలను కలెక్టర్ దినేష్ కుమార్ మంగళవారం స్ట్రాంగ్ రూములో పరిశీలించారు. కళాశాలలోని స్ట్రాంగ్ రూముల వద్ద ప్రతి రూముకి మూడంచెల భద్రతతో పోలీస్ నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఒంగోలు పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాలకు సంబంధించిన ఇవిఎంలను పూర్తిస్థాయిలో పరిశీలించి రూములో ఉంచి గదికి సీల్ వేసినట్లు తెలిపారు. స్ట్రాంగ్ రూములో భద్రత విషయంలో రాజీ పడేది లేదని తెలిపారు. అక్కడ మూడుంచెల భద్రత ఏర్పాటు చేసినట్లు తెలిపారు.



ఇవిఎంలను పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్ కుమార్



మార్కాపురం నుంచి ఒంగోలు ఇవిఎంల తరలింపు

ఒంగోలుకు ఇవిఎంల తరలింపు...

ప్రజాశక్తి- మార్కాపురం

మార్కాపురానికి సంబంధించిన ఇవిఎంలను మంగళవారం ఒంగోలుకు తరలించారు. మార్కాపురం మున్సిపాలిటీ, మార్కాపురం మండలం, తర్లుపాడు మండలం, కొనకనమిట్ల మండలం, పొదిలి మండలానికి సంబంధించిన ఎన్నికల సామగ్రిని సోమవారం రాత్రి మార్కాపురంలోని ఎస్‌వికెపి కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరించారు. నియోజకవర్గంలోని 257 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన ఇవిఎంలతో పాటు ఇవిప్యాడ్‌లను ఒంగోలులోని రైజ్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూమ్‌కు కంటైనర్ ద్వారా మంగళవారం తరలించారు. ఇవిఎం, ఇవిప్యాడ్ల తరలింపు సందర్భంగా గట్టి పోలీసు భద్రతను ఏర్పాటు చేశారు. తరలింపు ప్రక్రియను ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాహుల్ మీనా పర్యవేక్షించారు. డిఎస్‌పి ఎం.బాలసుందరరావు, సిఐ ఆవుల వెంకటేశ్వర్లు, ఎన్నికల సహాయ అధికారి రవికుమార్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇవిఎం, ఇవిప్యాడ్‌లను తరలిస్తున్న కంటైనర్‌తో పాటు బిఎస్‌ఎఫ్ బలగాలు, స్థానిక పోలీసులు బందోబస్తుగా వెళ్లారు.

కేసుల పరిష్కారానికి

మధ్యవర్తిత్వం మేలు : జడ్జి

ప్రజాశక్తి - గిద్దలూరు



మాట్లాడుతున్న జడ్జి

కేసుల పరిష్కారానికి మధ్యవర్తిత్వము ఎంతో దోహదపడుతుందని అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి బి.మేరీ సారా ధానమ్మ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయసేవాధికారసంస్థ ఆదేశాల ప్రకారం గిద్దలూరు మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానసిక కోర్టు ఆవరణలో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి బి మేరీ సారా ధానమ్మ అధ్యక్షతన గిద్దలూరు బార్ అసోసియేషన్ న్యాయ వాదులకు 'మధ్యవర్తిత్వము'(మీడియేషన్)పై అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ మధ్యవర్తిత్వము యొక్క ప్రాముఖ్యత గురించి వివరించారు. ప్రస్తుత సమాజంలోని కేసులను, సమస్యలను పరిష్కరించుకోవటానికి మధ్యవర్తిత్వము ఎంతో గానో దోహదపడుతుందని తెలిపారు. కక్షిదారులు తమ కేసులను సున్నితంగా పరిష్కరించుకొనటానికి మధ్యవర్తిత్వ మార్గమును ఎంచుకోవాలన్నారు. తద్వారా తమ విలువైన సమయాన్ని ఆదా చేసుకోవడమే కాకుండా ఖర్చులన కూడా తగ్గించుకోవచ్చని తెలిపారు. కుటుంబ సభ్యుల మధ్య ఉన్న చిన్న సమస్యలను, వివాదాలను సత్వరమే పరిష్కరించు కొంటానికి మరియు అందరూ కలిసి పోయి, తిరిగి ప్రశాంత జీవనం కొనసాగించటానికి ఈ మధ్యవర్తిత్వ మార్గము ఎంతో దోహదపడుతుందన్నారు. కోర్టు కేసులలో కూడా 89 సిపిసి ఈ ప్రత్యమ్నాయం తెలియజేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సెక్రటరీ ఉదయగిరి మల్లికార్జున రావు, ప్యానల్ న్యాయవాది కె.రవి ప్రకాష్ బాబు, న్యాయవాదులు పాల్గొన్నారు.



ఒకే రరం దుస్తులతో పోలింగ్ విధులు నిర్వహించిన మహిళా ఉద్యోగులు

వెంకటాద్రిపాలెంలో

మోడల్ పోలింగ్ కేంద్రం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం మండలం వెంకటాద్రిపాలెం పోలింగ్ కేంద్రంలో మొత్తం 1.268 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో 650 మంది మహిళలు, 618 పురుష ఓటర్లు ఉన్నారు. సోమవారం నిర్వహించిన సార్వత్రిక ఎన్నికల్లో ఆ పోలింగ్ కేంద్రం మహిళా మోడల్ పోలింగ్ కేంద్రంగా ఏర్పాటు చేశారు. దీంతో పోలింగ్ విధులు నిర్వహించే సిబ్బంది మొత్తం ఒకే డ్రస్ కోడ్‌తో విధులు నిర్వహించారు. రాత్రి తొమ్మిది గంటలు వరకూ ఓటర్లు తమఓటు హక్కును వినియోగించు కున్నారు. 592 మంది మహిళలు, 546 మంది పురుషులు కలిపి మొత్తం 1138 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 89.75 శాతం ఓట్లు పోలయ్యాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా, పోలింగ్ కేంద్రంలో ఎలాంటి సాంకేతిక లోపాలు తలెత్తకుండా మహిళా ఉద్యోగులు తగు జాగ్రత్తలు తీసుకున్నారు.

20 ఏళ్ల తర్వాత ఎండిన చెరువు

పశువులకు నీరు లేక రైతుల ఇక్కట్లు

ప్రజాశక్తి-పెద్దదోర్నాల



ఎండిపోయిన గంటావానిపల్లె చెరువు

పెద్దదోర్నాల మండలం గంటావానిపల్లి చెరువు 20 ఏళ్ల తర్వాత పూర్తిగా ఎండిపోయింది. వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణం ప్రారంభించిన నాటి నుంచి ఇప్పటి వరకూ ఈ చెరువు వెలిగొండ ప్రాజెక్టు ఊట నీరుతో కళకళలాడుతుండేది. ఇటీవల వెలిగొండ ప్రాజెక్టు పిల్ల కాలువలన్నింటిని మెయిన్ కాలువలో కలిపారు. దీంతో చెరువుకు వచ్చే ఊట నీరంతా ఆగిపోయింది. ఫలితంగా చెరువు పూర్తిగా ఎండిపోయింది. ఈ చెరువులో నీళ్లుంటే గంటావానిపల్లి, కొత్తూరు, యడవల్లి గ్రామాల్లోని సాగు, తాగునీటి బోర్లలో భూగర్భ జలమట్టం పెరుగుతుంది. చెరువు కింద 700 ఎకరాల ఆయకట్టు భూమి ఉంది. ఆ భూముల్లో పత్తి, మిర్చి పంటలు సస్యసామలంగా పండేవి. చెరువు ఎండిపోవడంతో మూడు గ్రామాల పరిధిలోని బోర్లలో భూగర్భ జలమట్టం పడిపోయింది. పొలాలకు వెళ్లిన పశువులు తాగేందుకు నీళ్ల లేవు. దీంతో పశు పోషకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గంటావానిపల్లి చెరువు వల్ల 20 ఏళ్ల నుంచి ఎంతో లబ్ధి పొందామని కొత్తూరుకు చెందిన రైతు కృష్ణారెడ్డి తెలిపారు. కనీసం పశువులకు నీళ్ల కూడా లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. చెరువు ఎండిన కారణంగా భూగర్భ జలమట్టం పడిపోవడంతో పాటు ఆయకట్టు భూములు కూడా సాగుకు నోచలేదని గంటావారిపల్లి రైతు పుల్లయ్య తెలిపారు.

'దర్శి'లో 90. 99 శాతం పోలింగ్

ప్రజాశక్తి-దర్శి

దర్శి నియోజకవర్గంలో గతంలో ఎన్నడు లేని విధంగా 90.99 శాతం పోలింగ్ నమోదైంది. 2019 ఎన్నికల్లో 90 శాతం పోలింగ్ నమోదైంది. ఈసారి ఒక శాతం పోలింగ్ పెరిగింది. నియోజక వర్గంలో మొత్తం 2,26,370 ఓటర్లు ఉన్నారు. అందులో 2,05,993 మంది తమ ఓటు వినియోగించుకున్నారు. సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా ముగిసినట్లు దర్శి నియోజకవర్గఎన్నికల రిటర్నింగ్ అధికారి లోకేశ్వరరావు తెలిపారు. కొన్ని పోలింగ్ కేంద్రాల్లో అర్ధరాత్రి రాత్రి 12 గంటల వరకూ ఓటింగ్ జరిగినట్లు ఆయన తెలిపారు. మొత్తం 282 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన ఇవిఎంలను ఒంగోలులోని రైజ్ కాలేజీలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూములకు తరలించినట్లు ఆయన తెలిపారు. రీపోలింగ్ లేకుండా చెదురు మదురు సంఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా ముగిసినట్లు ఆయన తెలిపారు.

జాతీయ స్థాయి పోటీలకు శివయ్య

ప్రజాశక్తి-కొనకనమిట్ల



మండల పరిధిలోని వెలుగొండ అంబేద్కర్ గురుకుల పాఠశాలకు చెందిన ఇట్ల శివయ్య, ఆర్.విష్ణువర్ధన్, డి.మహంత చిత్తూరులో నిర్వహించిన రాష్ట్ర స్థాయి రెస్లింగ్(అండర్-17) పోటీల్లో పాల్గొని పాల్గొని ప్రతిభ చూపారు. ఇట్ల శివయ్య బంగారు పతకం సాధించాడు. ఈనెల ఆఖరున జార్ఖండ్‌లో నిర్వహిస్తు్ను జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపల్ సాతులూరు వెంకటేశ్వరావు తెలిపారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన పిఇటిలు చంద్రశేకర్, ఎస్‌కె.ఖాదర్‌బాషా, పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను ప్రిన్సిపల్ అభినందించారు.



నోట్ పుస్తకాలు అందజేస్తున్న దాతలు

నోట్ పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి-శింగరాయకొండ

జరుగుమల్లి పోలీస్ స్టేషన్‌లో మహిళా కానిస్టేబుల్‌గా పని చేస్తున్న శింగరాయకొండకు చెందిన షేక్ రేష్మ తన కుమారుడు షారిక్‌ఈషన్ పుట్టినరోజు సందర్భంగా శానంపూడి పంచాయతీ పరిధిలోని గిరిజన కాలనీకి చెందిన చిన్నారులకు మంగళవారం నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం మిఠాయిలు పంచి పెట్టారు. ఈ సందర్భంగా రేష్మ మాట్లాడుతూ తన కుమారుడి పుట్టిన రోజు వేడుకలు ప్రతి సంవత్సరం చిన్నారుల మధ్య జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. చిన్నారులు ప్రభుత్వ పథకాలను అందుకొని బాగా చదువుకోవాలన్నారు. ఈ సందర్భంగా న్యాయ సేవా సహాయకుడు పంతగాని వెంకటేశ్వర్లు గిరిజన చిన్నారులకు విద్యాపరమైన సహాయ సహకారాలు అందిస్తున్న దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

87.55 శాతం పోలింగ్ నమోదు

చీమకుర్తి: సంతనూతలపాడు నియోజక వర్గ పరిధిలో 87.55 శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల రిటర్మింగ్ అధికారి ఆర్.గోపాలకృష్ణ తెలిపారు. నియోజక వర్గంలో మొత్తం 2,14,638 మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. పురుషులు 105497 మంది, మహిళలు 1,09,137, ఇతరులు నలుగురు ఓటు హక్కు కలిగి ఉన్నట్లు తెలిపారు. 236 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు నిర్వహించినట్లు తెలిపారు. 92,708 మంది పురుష ఓటర్లు, 95202 మంది మహిళా ఓటర్లు, ఇతరులు ఇద్దరు తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు తెలిపారు. మొత్తం 2,14,638 మందికి గానూ 1,87,912 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నట్లు తెలిపారు.



దాడిలో గాయపడిన రవిని పరామర్శిస్తున్న అశోక్ బాబు

గాయపడ్డ వారికి అశోక్ బాబు పరామర్శ

ప్రజాశక్తి - వేమూరు

సార్వత్రిక ఎన్నికల సందర్భంగా వివిధ పోలింగ్ కేంద్రాల వద్ద టీడీపీ, జనసేన, వైసిపి మధ్య జరిగిన గొడవలు, వివాదాల్లో గాయపడిన కార్యకర్తలను వైసిపి అభ్యర్థి వరికూట్టి అశోక్ బాబు మంగళవారం పరామర్శించారు. మండలంలోని చావలి గ్రామానికి చెందిన కూచిపూడి రవి అనే వైసిపి కార్యకర్తను జనసేన, వైసిపి నాయకులు మధ్య జరిగిన వివాదంలో తీవ్ర గాయాలై తెనాలి ప్రభుత్వ వైద్యశాల్లో చికిత్స పొందుతున్నాడు. అశోక్ బాబు వైద్యశాలకు వెళ్లి పమర్శించి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. రవికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మండల కేంద్రం పార్టీలోని అద్దేపల్లిలో కెటివి విలేఖరిపై కత్తితో దాడి జరిగి గాయాలపాలై చికిత్స పొందుతుండగా ఆయనను కూడా అశోక్ బాబు పరామర్శించి భరోసా ఇచ్చారు. ఆయన వెంట నియోజకవర్గంలోని వివిధ మండలాల వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



అభివాదం చేస్తున్న అశోక్ బాబు దంపతులు

మరోసారి వైసీపీ విజయం సాధిస్తుంది

ప్రజాశక్తి - వేమూరు

సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి మరోసారి గెలుస్తుందని, జగన్మోహన్‌రెడ్డి సారధ్యంలో వైసిపి విజయం సాధిస్తుందని ఆ పార్టీ అభ్యర్థి వరికూటి అశోక్ బాబు ధీమా వ్యక్తం చేశారు. గత నాలుగు నెలలుగా తాను మరో ప్రాంతం నుండి ఇక్కడికి నూతనంగా వచ్చిన వ్యక్తినైనప్పటికీ ప్రజలు తనను ఎంతో ప్రేమాభిమానాలతో ఆదరించి తనని నిన్నంటి ఎన్నికల వరకు తన గెలుపు కోసం కృషి చేశారని అన్నారు. అలాంటి ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. పోలింగ్ పూర్తి అయ్యేవరకు వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఎంతో పట్టుదలతో మరోసారి జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించుకునేందుకు కృషి చేశారని అన్నారు. ఎన్నికల ఫలితాలుతో సంబంధం లేకుండా తాను నియోజకవర్గంలోనే ఉండి ప్రజలకు నిరంతర సేవా కార్యక్రమాలు చేపట్టి అందుబాటులో ఉంటారని తెలిపారు. నియోజకవర్గంలో ఈసారి ఎన్నికల్లో అధిక శాతం ఓట్లు పోలయ్యాయని, సిఎంగా జగన్మోహన్ రెడ్డి చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిని చూసి దూరప్రాంతాల నుండి కూడా వచ్చే ఓటు హక్కులు వినియోగించుకోవడం అభినందనీయమని అన్నారు. వీరికి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

చీరాలలో 82.61శాతం పోలింగ్

ప్రజాశక్తి - చీరాల

నియోజకవర్గంలో 82.61శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల అధికారి సూర్యనారాయణరెడ్డి మంగళవారం తెలిపారు. మొత్తం 202711 మంది ఓటర్లు ఉండగా వారిలో 167466 మంది ఓటు హక్కు వినియోగించు కున్నట్లు తెలిపారు. వీరిలో పురుషులు 81772 మంది, 85681స్త్రీలు, 13 మంది అర్ధనారీశ్వరులు ఓటు హక్కు వినియోగించుకున్నట్లు తెలిపారు. గత ఎన్నికల్లో 72 శాతం ఓటింగు నమోదు కాగా ఈసారి 10 శాతం పోలింగు పెరిగినట్లు తెలిపారు. పెరిగిన ఓట్ల శాతం ఎవరి గెలుపు ఓటములను నిర్ణయిస్తాయో వేచి చూడాలి.

పోలింగ్ సరళిపై సర్వత్రా చర్చ

- ప్రభుత్వ వ్యతిరేకతపై టిడిపి వర్గాల్లో ఆశలు
- సంక్షేమ పథకాలతో మహిళలే గట్టెక్కిస్తారని వైసిపి విశ్లేషణ
- జూన్ 4న తేలనున్న అభ్యర్థుల భవిత్యవం

ప్రజాశక్తి - పంగులూరు

ఎప్పుడెప్పుడా అని ఎదురుచూసిన ఎన్నికలు సోమవారంతో ముగిశాయి. ఎన్నికలు ఎలాంటి దుర్ఘటనలు జరగకుండా ప్రశాంతంగా జరగటం పట్ల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. అయితే ఎన్నికలు పూర్తయిన మరుసటి రోజు మంగళవారం నుండి ప్రతిచోట ఎన్నికల సరళిపైనే చర్చ జరుగుతుంది. ఎవరు ఎటు చేశారు. ఏ వర్గం ఏ పార్టీకి మద్దతుగా నిలిచింది. ఎవరికి ఎన్ని ఓట్లు రాబో తున్నాయి. ఏ అభ్యర్థి ఎన్ని ఓట్ల మెజారిటీతో గెలవబో తున్నాడు. అనే అంశాలపై ప్రజలు చర్చించు కుంటున్నారు. అద్దంకి నియోజవర్గంలో టిడిపి అభ్యర్థిగా గొట్టిపాటి రవికుమార్‌పై వైసీపీ అభ్యర్థిగా పానెం చిన్న హనిమిరెడ్డి పోటీ చేసిన విషయం పాఠకులకు తెలిసిందే. ఎన్నికల్లో ఇద్దరు అభ్యర్థుల తరపున విపరీతమైన ప్రచారం జరిగింది. అభ్యర్థులతో పాటు అభ్యర్థి కుటుంబ సభ్యులు, బంధు వులు, నాయకులు గ్రామాల్లో ఇంటింటికి తిరిగి ప్రచారం చేశారు. సుమారు నెలరోజుల పాటు గ్రామాల్లో డిజె సౌండ్ సిస్టమ్స్ తో ప్రచారాన్ని హోరెత్తించారు. చివర్లో మద్యం ఏర్లు పారించారు. చివరి రెండు, మూడు రోజుల్లో డబ్బు వెదజల్లి ఓట్లు కొనుగోలు చేశారు. అయినా కూడా ఏ ఓటరు ఏ పార్టీకి ఓటు వేశాడో అర్థం కాని పరిస్థితి నెలకొంది. ఓటరు మనస్తత్వం అర్థం కాకపోయినప్పటికీ నాయకులు, కార్యకర్తలు గెలుపు తమదంటే తమదంటూ లెక్కలు వేసుకుంటున్నారు. కచ్చితంగా ఇన్నివేల ఓట్ల మెజారిటీతో తమ అభ్యర్థి బయటపడతాడని ఒక పార్టీ అంటే కాదు తమ అభ్యర్థి ఎన్నికల్లో తప్పకుండా విజయం సాధిస్తాడని మరో పార్టీ నాయకులు చెబుతున్నారు. ఇక



సామాన్య ప్రజల విషయానికొస్తే అరుగుల మీద, రచ్చబండల దగ్గర, హోటల్స్, టీ స్టాల్స్, చివరికి ఉపాధి హామీ పని దగ్గర కూడా ఎన్నికల్లో ఎవరు గెలుస్తారనే దానిపైనే చర్చ జరుగుతుంది. సంక్షేమ పథకాలు అమలు చేసి పేదలకు అంతో ఎంతో ఉపయోగపడిన జగన్మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అవ్వటం ఖాయమని వైసిపి అభిమానులు వాదన వినిపిస్తునన్నారు. అద్దంకిలో ఆ పార్టీ అభ్యర్థి హనిమిరెడ్డి గెలుస్తాడని వాదిస్తుండగా, సంక్షేమం పేరుతో అనేక అవకతవకలకు, అరాచకాలకు పాల్పడిన జగన్మోహన్‌రెడ్డి ఇక ఇంటికేనని, టిడిపి సూపర్ సిక్స్ పథకాల ద్వారా ప్రజల్లోకి వెళ్లిన చంద్రబాబు ముఖ్యమంత్రి అవ్వడం ఖాయమని టిడిపి మద్దతు దారులు వాదనలు వినిపిస్తున్నారు. అద్దంకి నియోజకవర్గంలో గొట్టిపాటి రవికుమార్ నాలుగోసారి ఎంఎల్ఎగా ప్రమాణం చేయటం ఖాయమని కార్యకర్తలు, అభిమానులు చెబుతున్నారు. ఇందులో భాగంగానే ఆ గ్రామంలో ఇన్ని ఓట్లు వస్తాయని, ఈ గ్రామంలో ఇన్ని ఓట్లు వస్తాయని, ఈ సారి ఆ గ్రామంలో ఫలానా పార్టీకి మెజార్టీ తగ్గి ఫలానా పార్టీ ఓట్లు పెరుగుతాయని లెక్కలు వేస్తున్నారు. ఫలానా గ్రామంలో రెండు పార్టీలకు సమానంగా ఓట్లు వస్తాయని కాకి లెక్కలు వేస్తున్నారు. గత ఎన్నికల్లో గొట్టిపాటి రవికుమార్ 13,500 మెజారిటీతో విజయో సాధించాడని, ఈసారి కూడా గెలుపు తమదేనని చెబుతున్నారు. పేదలు ఈసారి వైసీపీకి అండగా నిలబడ్డారని, హనిమిరెడ్డి విజయ సాధిస్తాడని వైసీపీ వర్గాలు లెక్కలు కడుతున్నాయి. తెలంగాణ నుంచి, విదేశాల నుంచి భారీగా ఆంధ్రప్రదేశ్‌కు ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకునేందుకు తరలి వచ్చారని, వారిలో 90శాతం ఓట్లు టిడిపివేనని, అందువలన తెలుగుదేశం విజయం ఖాయమని అంటున్నారు. పైగా ఉద్యోగులు, నిరుద్యోగులు వైసీపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు చేశారని అంచనా వేస్తున్నారు. ఎన్నికల్లో చంద్రబాబు చెప్పిన మాటలు ఎవరు నమ్మటం లేదని, ఆయన ఎన్ని హామీలు ఇచ్చినా అవి అమలు జరిగేవి కావని, అందువలన మహిళలు పెద్ద ఎత్తున వైసీపీకి ఓటు వేశారని, వైసీపీ గెలుపు ఖాయమని ఆ పార్టీ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఇలా ప్రతిచోట ఓట్ల సరళిని గురించే చర్చించుకోవడం కనిపించింది. కొన్నిచోట్లైతే ఇప్పుడిప్పుడే గెలుపు ఓటమి మీద పందాలు కాసుకునేందుకు కూడా కొంతమంది సిద్ధపడుతున్నట్లు తెలుస్తోంది. జూన్ 4న ఓట్ల లెక్కింపు జరిగి ఫలితాలు వెలువడే వరకు ఇలాంటి ఊహాగానాలు వినాల్సిందే. ఎవరెన్ని లెక్కలు కట్టుకున్నా ఓటరు తీర్పు నిక్షిప్తమైన ఇవిఎంలు తెరిస్తేనే అభ్యర్థుల భవితవ్యం తేలనుంది.

కొనుగోళ్లతో కళకళలాడుతున్న దుకాణాలు

- పట్టణంలో పండుగ వాతావరణం
- ఎన్నికల సందర్భంగా జనంలోకి చేరిన డబ్బు
- వస్త్ర, సెల్‌ఫోన్, ఎలక్ట్రానిక్ దుకాణాల్లో సందడి
- అందరి వద్ద రూ.500 నోట్లే
- మద్యం షాపుల వద్ద పెరిగిన కొనుగోళ్లు

ప్రజాశక్తి - చీరాల

ఎన్నికలు ముగిశాయి. గెలుపు కోసం అభ్యర్థులు ఎవరికి వాళ్లే పోటీ పడ్డారు. ఎన్నికలు ముగిశాక ఎవరు గెలుస్తారనే చర్చలు ఒక వైపు చేస్తుంటే మరోవైపు ఎప్పుడూ లేని విధంగా ఎన్నిలైన రెండో రోజే పట్టణంలోని వివిధ వ్యాపార దుకాణాలు కొనుగోలు దారులతో కళ కళలాడుతున్నాయి. గెలుపు ఆశతో అభ్యర్థులు కోట్లలో ఖర్చు పెట్టారు. ఓటుకు రేటు కట్టి పంపిణీ చేశారు. రెండు ఓట్లు ఉన్న తటస్థ ఓటర్ల ఇళ్లకు రూ.5వేలకుపైగానే చేరాయి. అదే కొంచెం పెద్ద కుటుంబమైతే రూ.20వేలకుపైగానే చేందాయి. ఎన్నికలు ముగిన రెండో రోజే ఆ నగదు మొత్తం చలామణిలోకి వచ్చేసింది. నగదుతో ఎంచక్కా షాపింగ్ లు చేస్తూ బిజీ బిజీగా ఉన్నారు. పట్టణంలో ఏ ప్రధాన వీధి చూసినా పండగ వాతావరణం కనిపిస్తుంది. ఎండను సైతం లెక్క చేయకుండా వస్త్ర దుకాణాల రోడ్లన్నీ కొనుగోలు దారులతో కిక్కిరిసిపోతున్నాయి. ఎన్నికల పుణ్యమా అంటూ ఒక్కో ఇంటికి సుమారు రూ.10వేల నుండి రూ.25వేల వరకు ముట్టినట్లు సమాచారం. టిడిపి, వైసిపి, కాంగ్రెస్ ముగ్గురు అభ్యర్థులు బరిలో ఉండడం, ఆ ముగ్గురు ఓటరుకు సుమా రు రూ.4500 వరకు పంచి ఉంటారని ఆయా పార్టీల కార్యకర్తలు చెబుతున్న లెక్కలు వింటే అర్థం అవుతుంది.



గృహోపకరణాలు కొనుగోలు చేస్తున్న ప్రజలు

నియోజకవర్గంలో 202711 మంది ఓటర్లు ఉన్నారు. దీన్ని బట్టి చూస్తే అభ్యర్థులు రూ.కోట్లలో నగదు ఓటర్లకు ఖర్చు చేసినట్లు తెలుస్తోంది. ఈ నగదు అంతా బయట మార్కెట్లో చలామణిలోకి రానుంది. దీంతో కుటుంబ సభ్యులు అందరూ ఎన్నికల సమయంలో వచ్చిన నగదును వృథా చేయకుండా ఇంటికి సంబంధించిన గృహపకరణాలు కొనుగోలు చేసుకునేందుకు కొందరు నిర్ణయించుకున్నారు. ఆదిశగా షాపింగ్ ప్రారంభించారు. ఇదిలా ఉంటే కొంతమంది తల్లి, దండ్రులు పిల్లల పాఠశాల ఖర్చుల కోసం వాటిని పొదుపు చేసుకొన్నారు. అయితే యువత మాత్రం ఎన్నికల నగదు గుర్తుగా బట్టలు, ఎలక్ట్రికల్ వస్తువులు కొనుగోలు చేస్తున్నారు. ఇక మందుబాబులకు మాత్రం వారం రోజులు పండుగే పండుగ. దీంతో వ్యాపా రస్తులు అందరూ వేసవి కాలంలో వ్యాపారాలు లేవనుకుం టున్న సమయంలో ఎన్నికల రూపంలో నగదు రావటం, ఆ నగదు బయట మార్కెట్లో ప్రజలు ఖర్చు చేయటం వలన నగదు రొటేషన్ జరుగుతోందని సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలో దుకాణాలు అన్ని కొనుగోలు



కొనుగోలు దారులతో రద్దీగా ఉన్న వస్త్ర దుకాణాలు

దారులతో నిండి పండుగ వాతావరణం కనిపిస్తుంది. గృహపకరణాల కొనుగోలులో ఎన్నికలు ఎంతగానో ఉపయోగపడ్డాయని, వారి అవసరాలు తీర్చుకుంటు న్నామని ఓటర్లు చెప్పకనే చెబుతున్నారు. ఇదిలా ఉంటే రాష్ట్ర వ్యాప్తంగా అభ్యర్థులు అందరూ గెలుపు ఓటమిల మధ్య టెన్షన్ పడుతున్నారు. అయినప్పటికీ ఎవరికి వారే తమదే గెలుపు అంటూ ధీమా వ్యక్తం చేస్తూ నాయకులు, కార్యకర్తలతో ఎన్నికల సరళిపై విశ్లేషిస్తున్నారు.

ఎగ్జిబిషన్‌లోనూ జనమే...

నిన్నటి వరకు ఎగ్జిబిషన్‌లో పెద్దగా సందడి కనిపించలేదు. కానీ మంగళవారం మాత్రం ఎగ్జిబిషన్ లో పలే కాదు ఎగ్జిబిషన్ రోడ్డు మొత్తం జనంతో నిండిపో యింది. పిల్లల సందడి కనిపించింది. తల్లులు పిల్లలను వెంటెబట్టుకుని ఎగ్జి బిషన్‌కు రావడం పిల్లలకు ఆనందాన్ని కలిగించింది. రోజుటికన్నా ఎక్కువగా సందర్భకులు రావ డంతో ఎగ్జిబిషన్ లోపలున్న చిరు దుకాణాల నిర్వాహ కులూ ఆనందం వ్యక్తం చేశారు. ఇలా పట్టణంలో జనంతో రద్దీగా ఉండటం పండుగ వాతావరణం తలపించింది.



దుకాణాల నుండి తరలిస్తున్న ఎలక్ట్రానిక్ వస్తువులు



మద్యం దుకాణం వద్ద రద్దీగా మందుబాబులు



ఎగ్జిబిషన్ రోడ్లులో రద్దీగా సందర్శకులు

ప్రజాశక్తి

7

బుధవారం 15 మే 2024

డీఎస్పీని సస్పెండ్ చేసి సమగ్ర విచారణ చేయాలి

• కాంగ్రెస్ అభ్యర్థి ఆమంచి, గ్రేగోరీపై దాడులకు ఖండన • భౌతిక దాడులు హేయమైన చర్య



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి - చీరాల

ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన పోలీసులే దాడులకు తెగబడుతున్నారని, చీరాలలో పోలీసులు రాజకీయ ప్రేరేపితంగా పనిచేస్తూ భౌతిక దాడులకు పాల్పడుతున్నారని, భక్షక బటులుగా వ్యవహరిస్తున్నారని, పోలింగ్ బూతులను పరిశీలించేందుకు వచ్చిన కాంగ్రెస్ అభ్యర్థి ఆమంచి కృష్ణమోహన్‌పై వైసీపీ నాయకులు, బయట వ్యక్తులును తీసుకోని వచ్చి అడ్డగించి దాడులకు తెగబడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు మాజీ కౌన్సిలర్ శీలం శ్యాం పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ రోజు కాంగ్రెస్ అభ్యర్థి, నాయకులపై జరిగిన దాడులను ఖండిస్తూ పట్టణంలోని గోలి సదాశివరావు కళ్యాణ మండపంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రజా సంఘాల నాయకులు విలేకరులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. చీరాలలో అన్ని రాజకీయ పార్టీలు ఎవరి ప్రచారాలు వాళ్ళు చేసుకుంటూ స్నేహ పూరిత వాతావరణంలో పోటీ చేస్తాయని, సమస్యలు వస్తే అందరూ కలిసికట్టుగా పరిష్కారానికి కృషి చేస్తారని అన్నారు. అలాంటి ప్రశాంత వాతావరణం ఉన్న నియోజక వర్గంలో కొత్తగా బయట వ్యక్తులను తీసుకువచ్చి భౌతిక దాడులు చేయిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ఎలాంటి కేసులు లేకుండా అందరితో ఆప్యాయంగా ఉండే ఎఎంసి మాజీ చైర్మన్ మార్పు గ్రేగోరిపై డీఎస్పీ బేతపూడి ప్రసాద్ దాడి చేయటం ఏంటని ప్రశ్నించారు. పేరాలలో మాజీ కౌన్సిలర్ పంచుమర్తి సాయి ఇంటి మీదకి కొత్త వ్యక్తులు వెళ్ళి రాళ్లు రువ్వి కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు గురి చేశారని అన్నారు. నియోజకవర్గంలో శాంతి భద్రతలు కరువయ్యాయని అన్నారు. వెంటనే పోలీసు ఉన్నత అధికారులు చర్యలు తీసుకొని సమగ్ర విచారణ చేయాలని కోరారు. తక్షణం డిఎస్పీని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సందర్భంగా నియోజక వర్గంలో జరిగిన ఘటనలపై నిష్పక్షపాతంగా విచారించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జరిగిన ఘటన అంతటినీ ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకువెళ్లి ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం కార్యదర్శి ఎన్ బాబురావు, పి కొండయ్య, కాంగ్రెస్ నాయకులు నీలం శ్యాం, దేవరపల్లి బాబురావు, మాజీ కౌన్సిలర్ మల్లెల బుల్లిబాబు, గవిని వేణు, కోటి దాసు, షేక్ సిరాజ్, చుండూరు వాసు, విజయ్ కుమార్, బొనిగల పేతురు బాబు, డేటా జోసఫ్, కౌన్సిలర్ పాపిశెట్టి సురేష్, మేరిగ ఇస్సాకు, పులి శంకర్ పాల్గొన్నారు.

హోటల్ ధ్వంసం చేసిన ఇండో టిబెటన్ పోలీసులు

• ధ్వంసం అయిన అద్దాలు • సిబ్బందితో వాగ్వివాదం • సిఐ మల్లిఖార్జునరావు జోక్యంతో సద్దు మణిగిన వివాదం



ఐటిబిపి జవాన్లతో చర్చిస్తున్న సిఐ మల్లిఖార్జునరావు

ప్రజాశక్తి - చెరుకుపల్లి

హొటల్లో బిర్యాని తినడానికి వచ్చి బిర్యానీ తిన్న అనంతరం బిల్లు చెల్లించే విషయంలో వాగ్వాదం జరిగి హొటల్లో ఫర్నిచర్ ధ్వంసం చేసి, హొటల్లో పనిచేసే సిబ్బంది, భోజనం చేసే వారిపై ఇండో టిబెటన్ బోర్డర్ పోలీసులు దాడి చేసి గాయపరిచిన సంఘటన మండలంలోని గుల్లపల్లి గ్రామంలో మంగళవారం జరిగింది. బాధితులు, స్థానిక ప్రజల వివరాలు ప్రకారం సోమవారం జరిగిన ఎన్నికల బందోబస్తుకు మండలంలోని ఐటిబిపీ పోలీసులు విధులు నిర్వహించడానికి వచ్చారు. సోమవారం ఎన్నికలు విధులు నిర్వహించిన అనంతరం మంగళవారం స్థానిక గుల్లపల్లి జెడ్పి ఉన్నత పాఠశాల్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. మంగళవారం మధ్యాహ్నం కొంత మంది ఐటిబిపి పోలీసులు బిర్యాని కోసం స్థానిక అభిరుచి హొటల్‌కు వెళ్లారు. బిర్యానీ తిన్న అనంతరం బిల్లు చెల్లించే విషయంలో ఘర్షణ చోటు చేసుకుంది. అనంతరం వెళ్లిపోయిన ఐటిబిపి పోలీసులు గుల్లపల్లి జెడ్పి ఉన్నత పాఠశాల్లోకి వెళ్లి తమ సహచరులను కూడా తీసుకువచ్చి హొటల్ ఫర్నిచర్, అద్దాలు ధ్వంసం చేశారు. హొటల్ సిబ్బందిని, ఆ సయంలో హొటల్‌లో తింటున్న వారిని, హొటల్ యజమానులను గాయపరిచినట్లుగా బాధితులు ఫిర్యాదు చేశారు. ఐటిబిపి పోలీసులకు కూడా స్వల్ప గాయాలు అయినట్లు సమాచారం. ఈ మేరకు రేపల్లె రూరల్ సీఐ మల్లికార్జునరావు, ఎస్ఐ వై సురేష్ ఐటిబిపి అధికారి శక్తిమంత్ రాయ్, సిబ్బందితో చర్చలు జరిపారు. అనంతరం ఘర్షణకు పాల్పడిన సిబ్బందిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు ఇరు పక్షాల వారితో అధికారులు చర్చలు జరపడంతో సమస్య సద్దుమణిగింది.

జిల్లా ఓటర్లకు కృతజ్ఞతలు



మాగుంట శ్రీనివాసులురెడ్డి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

సార్వత్రిక ఎన్నికల సందర్భంగా పోలింగ్ కేంద్రాలకు వచ్చి క్యూలైన్‌లలో నిలబడి ఓట్లు వేసిన ఓటర్లకు టిడిపి ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులురెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. టిడిపి కూటమి నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి, బిజెపి, జనసేన కూటమి గెలుపు కోసం తనకు తోడుగా వుండి, అన్ని విధాలుగా సహకరించారని అన్నారు. ఒంగోలు పార్లమెంటు పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో ప్రచార కార్యక్రమాల్లో మండుటెండలను లెక్కచేయక పాల్గొని విశేష కృషి చేసినందుకు కూటమి శాసనసభ అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల కష్టాలను రూపుమాపడానికి నిరంతరం శ్రమించిన మీరు ప్రజల ఆశీర్వాదంతో అఖండ విజయాన్ని కైవశం చేసుకుంటారని ఆశిస్తున్నానని అన్నారు. ప్రచారంలో ప్రతి గ్రామంలో ఘన స్వాగతం పలికి, అడుగడుగునా బ్రహ్మరథం పట్టిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. ప్రజా సేవకోసం మొదలైన మాగుంట కుటుంబ రాజకీయ పర్వం, తరాలు మారిన ప్రకాశం జిల్లా ప్రజల సేవకే అంకితమై, ఎల్లప్పుడూ ప్రజలకు తోడుగా ఉంటామని అన్నారు. పోలింగు విధి నిర్వహణలో పాల్గొన్న ప్రభుత్వ సిబ్బందికి, పార్టీల నాయకులకు సహకరించి, పోలింగ్ సమయం దాటిన తదుపరి కూడా ఎంతో ఓపికతో గంటల తరబడి క్యూలలో వుండి ఓటింగులో పాల్గొన్నందుకు కృతజ్ఞతలు తెలిపారు.

ఒంగోలు ఓటర్లకు కృతజ్ఞతలు

రాజ్యాంగం ఇచ్చిన ఓటు హక్కును వినియోగించుకుని ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటిన ఒంగోలు నియోజకవర్గ ఓటర్లకు టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, కూటమి ఒంగోలు అసెంబ్లీ అభ్యర్థి దామచర్ల జనార్ధనరావు కృతజ్ఞతలు తెలిపారు. ఎండైనా, గంటల తరబడి క్యూలో నిరీక్షించి ఓటు వేసిన ఓటర్ల సహనం గొప్పదన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు సైనికుల్లా ఉద్యమించిన ప్రజలకు అభినందనలు తెలిపారు.



టిడిపి ఒంగోలు అసెంబ్లీ అభ్యర్థి దామచర్ల



పహారా కాస్తున్న పోలీసులు

సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీసుల పహారా

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీస్ అదికారులు పికెట్స్ ఏర్పాటు చేశారు. మే 13న జరిగిన ఎన్నికల సమయంలో జిల్లాలో అక్కడక్కడ చెదురు మదురు ఘర్షణలు, వివాదాలు చెలరేగాయి. ఆ ప్రాంతాల్లో విధులు నిర్వహించే పోలీసులు వేగంగా స్పందించారు. ఇరువర్గాలను చెదరగొట్టి శాంతి భద్రతలను పరిరక్షించారు. ఆ ప్రాంతాల్లో మరల ఏటువంటి వివాదాలు, ఘర్షణలు జరగకుండా శాంతి భద్రతలు పరిరక్షించేందుకు పోలీస్ పికెట్ ఏర్పాటు చెశారు. ఆ ప్రాంతంలో శాంతి భద్రతలను పరిరక్షిస్తూ అక్కడి పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించారు. పోలీసు బలగాలు వేగంగా ఆ ప్రాంతంలకు చేరుకుని ప్రారంభ దశలోనే ఘర్షణను కట్టడి చేసి శాంతి భద్రతలను పరిరక్షించేందుకు అవకాశం ఉంటుందని ఎస్పీ తెలిపారు. ఎవరైనా శాంతి భద్రతలకు భంగం వాటిల్లే విధంగా ఘర్షణలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో పలుచోట్ల జరిగిన ఘర్షణలపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఎన్నికల ప్రక్రియ ముగిసినప్పటికీ జిల్లాలోని ప్రజలు సంయమనంతో వ్యవహరించాలని కోరారు. ఎవరు వివాదాల, ఘర్షణలకు వెళ్ళరాదని సూచించారు. ఒకరికొకరు సోదరభావంతో మెలగాలని తెలిపారు. ఎవరైనా ఘర్షణలకు పాల్పడే అవకాశం ఉంటే సంబంధిత పోలీసు అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.



ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద పోలీసు పహారా

ఎన్టీఆర్ విగ్రహానికి నిప్పు

ప్రజాశక్తి - బాపట్ల

ఎన్నికల నేపథ్యంలో మండలంలోని పడమర పిన్నిబోయిన వారిపాలెంలో చోటు చేసుకున్న వివాదాలు గ్రామంలో మరింత రగులుతున్నాయి. గ్రామంలోని పోలింగ్ కేంద్రం వద్ద సోమవారం వైసిపి, టిడిపి నాయకుల మధ్య చోటు చేసుకున్న పరస్పర దాడుల్లో గాయపడిన నర్రా ఏడుకొండలు స్థానిక ఏరియా వైద్యశాల్లో చికిత్స పొందుతున్నారు. తాజాగా మంగళవారం రాత్రి సమయంలో గ్రామంలో ముసుగేసి ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి గుర్తు తెలియని వ్యక్తి నిప్పంటించాడని గ్రామస్తులు చెబుతున్నారు. చీకట్లో ఎన్టీఆర్ విగ్రహానికి నిప్పంటించింది. ఎవరో గుర్తించలేక పోయామని చెబుతున్నారు. ఎన్టీఆర్ విగ్రహానికి ముసుగేసిన వస్త్రం కాలిపోయి ఎన్టీఆర్ విగ్రహం పొగ చూరి నల్లగా మారింది. దీంతో గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సమాచారం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన పడమర పిన్ని బోయిన వారిపాలెం చేరుకుని ఎన్టీఆర్ విగ్రహం వద్ద పోలీస్ టికెట్ ఏర్పాటు చేశారు. డిఎస్పి మురళి ఆధ్వర్యంలో పోలీస్ పికెట్ కొనసాగుతోంది.

వేమూరులో 85.02శాతం నమోదు

ప్రజాశక్తి - వేమూరు

ఈ నెల 13న జరిగిన ఎన్నికల్లో నియోజకవర్గంలో 85.02శాతం ఓట్లు పోలయ్యాయి. నియోజకవర్గంలో మొత్తం 1,95,000పైగా ఓట్లు ఉండగా వీటిలో 1,77,666 ఓట్లు పోలైనట్లు రిటర్నింగ్ అధికారి వసంతరాయుడు తెలిపారు. వీటిలో భట్టిప్రోలు మండలంలో పురుషులు 17525, స్త్రీలు 18131, ఇతరులు 0.3 వేరసి 35,659 ఓట్లు పోలయ్యాయి. కొల్లూరు మండలంలో పురుషులు 19,147, స్త్రీలు 20032, ఇతరులు 0.5 కలిపి 39,184 ఓట్లు పోలయ్యాయి. వేమూరు మండలంలో పురుషులు 15172, స్త్రీలు15,548, ఇతరులు 0.4 చొప్పున 30,724, అమృతలూరు మండలంలో పురుషులు 15668, స్త్రీలు 16675, ఇతరులు ఒకటి చొప్పున 32,344, చుండూరు మండలంలో పురుషులు 15892, స్త్రీలు 16862, ఇతరులు ఒకరు కలిపి 32,755 ఓట్లు పోలైనట్లు పేర్కొన్నారు.



కవర్తపు శ్రీనివాసరావుకు నివాళి అర్పిస్తున్న మాగుంట

కవర్తపు కుటుంబానికి మాగుంట పరామర్శ

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

స్వాతి పైప్స్ అధినేత కవర్తపు శ్రీనివాసరావు ప్రధమ వర్ధంతి సందర్భంగా వారి స్వగృహంలో శ్రీనివాసరావు విగ్రహానికి మాజీ ఎంపి, టిడిపి ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులురెడ్డి పూలమాల వేసి నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులను మాగుంట పరామర్శించారు. కార్యక్రమంలో సినీ నటులు కృష్ణంరాజు సతీమణి శ్యామలా దేవి, కవర్తపు శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన ఎన్నికలు: ఎస్పీ

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

బాపట్ల జిల్లాలో చెదురుమొదురు ఘటనలు మినహా ప్రశాంతంగా సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ముగిసిందని ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. ఈవీఎం బాక్స్‌లను, ఎన్నికల సామగ్రిని, పోలింగ్ కేంద్రంలో ఎన్నికల విధులు నిర్వహించిన అధికారులను సాయుధ బలగాల ఎస్కార్ట్‌తో బాపట్ల పట్టణంలోని బి.ఇ.సి కళాశాలలోని స్ట్రాంగ్ రూమ్ వద్దకు చేర్చామని పేర్కొన్నారు. పోలీస్ అధికారులు, సిబ్బంది, మాజీ ఆర్మీ ఉద్యోగులు, ఎన్.సి.సి, ఎన్.ఎస్.ఎస్, కేంద్ర సాయుధ బలగాలు, తమిళనాడు పోలీసులు అందరూ సమయ స్ఫూర్తిగా వ్యవహరిస్తూ నిష్పక్షపాతంగా, నిబద్ధతతో విధులు నిర్వహించడం వల్ల జిల్లాలో ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందన్నారు. అవాంఛనీయ ఘటనలు చోటు చోటుచేసుకున్న ప్రదేశాలకు ఐదు నిమిషాల వ్యవధిలో పోలీస్ బలగాలు చేరుకుని శాంతిభద్రతలను పరిరక్షించడం జరిగిందన్నారు. పోలీస్ సిబ్బంది వేగంగా స్పందించడానికి, సమర్థవంతంగా శాంతి భద్రతలను పరిరక్షించడానికి "సమర్థ్" మొబైల్ యాప్ ఎంతగానో దోహదపడిందన్నారు. జిల్లాలో కొన్ని ప్రదేశాలలో వివాదాలు, ఘర్షణలు చోటుచేసుకున్నాయని, ఆ ప్రదేశాలలో పికెట్స్ ఏర్పాటు చెయ్యడం జరిగిందన్నారు.

ఓట్ల లెక్కింపు వరకు

ఈవీఎంలకు స్ట్రాంగ్ రూముల్లో పటిష్ట భద్రత

జిల్లా ఎన్నికల అధికారి రంజిత్‌బాషా

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ఓట్ల లెక్కింపు వరకు ఈవీఎంలకు స్ట్రాంగ్ రూముల్లో పటిష్ట భద్రత కల్పిస్తామని జిల్లా ఎన్నికల అధికారి రంజిత్‌బాషా తెలిపారు. సాధారణ ఎన్నికల పోలింగ్ ముగియడంతో ఈవీఎం యంత్రాలను అధికారులు స్ట్రాంగ్ రూములకు తరలించారు. బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలోని రిసెప్షన్ సెంటర్‌కు ఈవీఎం యంత్రాలు సోమవారం రాత్రి తీసుకెళ్లారు. పోలీస్ బందోబస్తు మధ్య ఎన్నికల సాధారణ పరిశీలకులు పరిమళ సింగ్, ఎన్నికల సాధారణ పరిశీలకులు ఖాజాన్ సింగ్, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్ బాషా, జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, పోటీలో ఉన్న అభ్యర్థుల సమక్షంలో వాటిని పరిశీలించి స్ట్రాంగ్ రూములో భద్రపరిచిన అనంతరం మంగళవారం వాటికి సీల్ వేశారు. కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి సిహెచ్ సత్తిబాబు, ఆరు నియోజకవర్గాల ఆర్వోలు పాల్గొన్నారు.


స్ట్రాంగ్ రూముకు సీల్ వేస్తున్న దృశ్యం

స్ట్రాంగ్ రూమ్స్‌కు ఈవీఎంలు

- పరిశీలించిన కలెక్టర్, సాధారణ పరిశీలకులు
- స్ట్రాంగ్ రూమ్స్ వద్ద పటిష్ట బందోబస్తు
- పోలింగ్ అధికారులు, సిబ్బందికి కలెక్టర్ కృతజ్ఞతలు


స్ట్రాంగ్స్ రూమ్స్ నుంచి వస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

పోలింగ్ ప్రక్రియను విజయవంతంగా ముగించుకొని ఒంగోలు శివారులోని రైజ్ ఇంజనీరింగ్ కళాశాలకు ఈవిఎంలు చేరుకున్నాయి. కళాశాలలో సెంట్రలైజ్డ్ స్ట్రాంగ్ రూమ్స్‌లో ఈవిఎంలను అధికారులు భద్రపరిచారు. ఒంగోలు, సంతనూతలపాడు, కొండపి నియోజకవర్గాలలో పోలింగ్ అనంతరం సోమవారం అర్ధరాత్రి (మంగళవారం తెల్లవారుజామున) పటిష్ట భద్రత మధ్య ఈవిఎంలు, ఇతర పోలింగ్ సామాగ్రితో సిబ్బంది ఇక్కడకు చేర్చారు. పోలింగ్ అధికారులు, సిబ్బందికి మంచి భోజనం, ఇతర సదుపాయాలను అధికారులు కల్పించారు. అనంతరం పోలింగ్ సామాగ్రిని స్వీకరించి, వాటిని చెక్ చేసుకుని, స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరిచారు. కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఏఎస్ దినేష్ కుమార్, జిల్లా ఎస్‌పి గరుడ్ సుమిత్ సునీల్ దగ్గరుండి ఈ ఏర్పాట్లను పరిశీలించి పోలింగ్ సిబ్బందితో ప్రత్యేకంగా మాట్లాడారు. పోలింగ్ అనంతరం సోమవారం తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్స్‌లో భద్రపరిచిన దర్శి, మార్కాపురం, యర్రగొండపాలెం, కనిగిరి, గిద్దలూరు నియోజక వర్గాల ఈవిఎంలు మంగళవారం రైజ్ ఇంజినీరింగ్ కళాశాలకు చేరాయి. పటిష్ట భద్రత మధ్య ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారుల పర్యవేక్షణలో ప్రత్యేక కంటైనర్ వాహనాల్లో వచ్చిన వీటిని అప్పటికే సిద్ధం చేసిన స్ట్రాంగ్ రూమ్స్‌లో అధికారులు భద్రపరిచారు. ఈవిఎంలకు ఏ విధమైన ప్రమాదం జరగకుండా స్ట్రాంగ్ రూములలో అన్ని భద్రతాపరమైన ఏర్పాట్లను చేశారు.



స్ట్రాంగ్ రూమ్ వద్ద సెక్యూరిటీగా సాయుధ పోలీస్

స్ట్రాంగ్ రూమ్స్‌ను పరిశీలించిన కలెక్టర్

ఈవిఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్స్‌ను కలెక్టర్, ఎస్‌పిలతో పాటు జిల్లా ఎన్నికల పరిశీలకులు అరవింద్ కుమార్ చౌరాసియా, మయూర్ కె.మెహతా ఈ ప్రక్రియను పరిశీలించారు. ఈవిఎంలు భద్రపరచిన స్ట్రాంగ్ రూమ్స్‌లో చేపట్టిన భద్రతా చర్యలపై ఎన్నికల పరిశీలకులు సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం రాజకీయ పార్టీల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌ల తలుపులకు సీల్ వేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, ఏఎస్‌పి కె.నాగేశ్వరరావు, డిఆర్‌ఒ ఆర్.శ్రీలత, ఇతర అధికారులు రాజకీయ పార్టీల ప్రతినిధులు వైసీపీ తరపున దామరాజు క్రాంతికుమార్, టిడిపి ప్రతినిధి అనిల్, బిజెపి ప్రతినిధి బసినేపల్లి రాజశేఖర్, గుర్రం సత్యం, కాంగ్రెస్ ప్రతినిధి ఎస్‌కె రసూల్, యర్రయ్య, పోటీ చేస్తున్న అభ్యర్థుల తరపు ప్రతినిధులు కూడా ఉన్నారు.

నీటి కోసం కోటి పాట్లు

- తీవ్రంగా మారిన సమస్య..
- కాగితాలకే పరిమితమైన జల జీవన్ మిషన్..
- దాహంతో అల్లాడుతున్న వైపాలెం నియోజకవర్గ ప్రజలు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

వేసవి రావడంతో చేతి పంపులన్నీ మొరాయించాయి. డీప్‌బోర్లన్నీ ఒట్టిపోయాయి. సాగర్ జలాలు అడుగు ముందుకు పడడం లేదు. జల జీవన్ పనులు కాగితాలకే పరిమితమయ్యాయి. పర్యవసానంగా యర్రగొండపాలెం నియోజకవర్గంలో నీటి కోసం కోటి కష్టాలు వచ్చాయి. అరకొరగా ట్యాంకర్ల ద్వారా అందే నీటిని సర్దుకుంటూ కాలం గడుపుతున్నారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో పొలాల వెంట వెళ్లి బిందెలతో తెచ్చుకుంటున్నారు.


పొలాల నుంచి సైకిల్‌పై నీళ్లు తెచ్చుకుంటున్న దృశ్యం

వైపాలెం నియోజకవర్గంలో..

యర్రగొండపాలెం నియోజకవర్గ పరిధిలో యర్రగొండపాలెం, పుల్లలచెరువు, త్రిపురాంతకం, పెద్దారవీడు, పెద్దదోర్నాల మండలాల్లో కలిపి 94 పంచాయితీలు ఉన్నాయి. వాటి పరిధిలో మొత్తం 130 గ్రామాలు దాకా ఉన్నాయి. ప్రతి యేటా వేసవి సమయంలో భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో రోజుకు సుమారు 900 ట్యాంకర్ల నీటిని ప్రభుత్వం ద్వారా సరఫరా చేసే వారు. అయితే ఈ ఏడాది ఫిబ్రవరి ఒకటో తేది నుంచి అధికారులు ట్యాంకర్లను నిలుపుదల చేశారు. దీంతో నీటి సమస్య తీవ్రమైంది. నీటి సమస్య తీవ్రంగా ఉన్న ప్రాంతాల్లో జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ ఆదేశాలతో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నా అవి ఏ మూలకు సరిపోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అడుగు ముందుకు పడని సాగర్ జలాలు..

ముటుకుల, దూపాడు, నడిగడ్డ, లక్ష్మీపురం, సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుల ద్వారా సాగర్ జలాలను పుల్లలచెరువు, యర్రగొండపాలెం, త్రిపురాంతకం, పెద్దారవీడు మండలాల్లోని పలు గ్రామాలకు సరఫరా చేయాల్సి ఉన్నా నిత్యం మూడు లీకులు, ఆరు పగుళ్లతో పట్టుమని పది గ్రామాలకు కూడా సరఫరా కావడం లేదు. దీంతో కోట్లాది రూపాయల వ్యయంతో నిర్మించిన సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులు కాంట్రాక్టర్లకు వరంగా మారాయే తప్ప ప్రజలకు గొంతు తడపడం లేదని వాపోతున్నారు.

కాగితాలకే పరిమితమైన జలజీవన్ మిషన్..

నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో జల జీవన్ మిషన్ ద్వారా గ్రామాల్లో బోర్లు వేయించి పైపులైన్లు వేసి ఇంటింటికి కుళాయి కనెక్షన్ ఇచ్చి మంచినీటిని అందించాలనేది జల జీవన్ మిషన్ లక్ష్యం. అయితే చాలా గ్రామాల్లో పాత బోర్లు, పైపులైన్‌లనే చూపించి, ఇంటింటికి కుళాయిలు వేసి బిల్లులు చేయించుకున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. మరికొన్ని గ్రామాల్లో కాగితాల్లోనే మమ అనిపించినట్లు సమాచారం. దీంతో నియోజకవర్గ పరిధిలోని సుమారు 20 గ్రామాలకు తప్ప మిగతా గ్రామాల్లో ఇంటింటికి కుళాయి ఏర్పాటు చేయలేదు.

తీవ్రంగా మారిన నీటి సమస్య..

నియోజకవర్గ పరిధిలోని యర్రగొండపాలెం మండలంలో యర్రగొండపాలెం, వెంకటాద్రిపాలెం, బిళ్లగొంది పెంట, అయ్యంబొట్లపల్లి, మురారిపల్లి, తమ్మడపల్లి,


ట్యాంకర్ వద్ద నీళ్లు పట్టుకుంటున్న దృశ్యం

గుర్రపుశాల, వాదంపల్లి, అమానుగుడిపాడు, పెద్దదోర్నాల మండలంలోని ఐనముక్కల, పెద్దదోర్నాల, చిన్నదోర్నాల, కటకానివానిపల్లి, రామచంద్రకోట, బొమ్మలాపురం, బోడే నాయక్ తాండా. చిన్న గుడిపాడు, పెద్దారవీడు మండలంలోని పుచ్చకాయలపల్లి, గొబ్బూరు, ఏనుగులదిన్నెపాడు, రాజంపల్లి, తోకపల్లి, దేవరాజుగట్టు, త్రిపురాంతకం మండలంలోని జి ఉమ్మడివరం, మేడపి, లేళ్లపల్లి, దువ్వలి, వెల్లంపల్లి, దూపాడు, పుల్లలచెరువు మండలంలోని మర్రివేముల, ముటుకుల, పుల్లలచెరువు, గంగవరం, వెంకటరెడ్డిపల్లి, రాచకొండ, మల్లాపాలెం, రంగన్నపాలెం, కుందంపల్లి, కొమరోలు తదితర గ్రామాల్లో నీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా పశు పోషకులు ఇంకా అవస్థలు పడుతున్నారు. ఓట్లపై ఉన్న శ్రద్ధ తమపై లేదంటూ ఆరోపిస్తున్నారు. భూగర్భ జలాలు పెరిగి బోర్లలో నీరు వచ్చే వరకు మరిన్ని ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసి నీటి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.